చురక

ప్రతిపక్షం అధికారం
ప్రజా తీర్పు గొప్పనిది
పాత్ర ఏది ఇచ్చినా
పోషించక తప్పనిది.

ఓడలు బల్లయినా
ఓర్పు నేర్పు ముఖ్యం
విస్మరిస్తే జనంలోనా
వివస్త్రే ప్రాముఖ్యం



-వేల్పుల నారాయణ
9440433475

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 31-1-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:140 పేజీలు:6 వెల: రూ.1/-


## హైదరాబాద్ శివార్లలోని నార్సింగిలో గంజాయి చాకెట్లు కలకలం

హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: హైదరాబాద్ శివార్లలోని నార్సింగిలో గంజాయి చాకెట్లు కలకలం సృష్టించాయి. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట ప్రాంతంలో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని ఒడిశాకు చెందిన సౌమ్యా రాజన్‌గా గుర్తించారు. అతని నుంచి 40 గంజాయి ప్యాకెట్లను సాధీనం చేసుకున్నారు. భవన నిర్మాణ కార్మికులకు చాక్లెట్లను అమ్ముతుండగా పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు చేస్తున్నామని చెప్పారు. వాటిని ఎక్కడి నుంచి తీసుకొచ్చాడనే విషయమై ఆరాతీస్తున్నారు.

# ట్యాంక్‌బండ్‌పై ప్రజాకవి గద్దర్ విగ్రహం ఏర్పాటు

## - గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం.. మాటను నిలబెట్టుకున్న రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 30(ఎక్స్ ప్రెస్ న్యూ స్); : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ప్రజాకవి గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానన్న రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెల్లాపూర్ మున్సిపాలిటీ చేసిన తీర్మానాన్ని హెచ్‌ఎండీఏ ఆమోదించింది. ఈ నేపథ్యంలో విగ్రహ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తూ మంగళవారం నాడు రేవంత్ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది.


ప్రజా యుద్ధ నౌకగా పేరుగడించిన గద్దర్ ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఆయన మరణించిన సమయంలో రాజకీయ పార్టీలు స్పందించిన తీరు అప్పట్లో చర్చకు దారి తీశాయి. అయితే టీపీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి మాత్రం గద్దర్ అంతిమయాత్రలో అన్నీ తానై ముందుకు నడిపించారు. గద్దర్ మరణ వార్త తెలిసిన వెంటనే ఆస్పత్రికి చేరుకున్న రేవంత్.. భౌతికకాయాన్ని ఎల్బీస్టేడియంకు తరలించడం దగ్గర నుంచి అంతిమయాత్ర, అంత్యక్రియలు ఇలా అన్నింటిలో ముందుండి నిర్వహించారు. ప్రభుత్వ లాంఛనాలతో గద్దర్ అంత్యక్రియలు జరిగినప్పటికీ.. అక్కడ అన్నీ చూసుకుంది మాత్రం రేవంత్ రెడ్డే. ఒక్కమాటలో చెప్పాలంటే గద్దర్‌ను కాంగ్రెస్ తన సొంతమనిషిలా చూసుకుని ఘనంగా వీడ్కోలు పలికింది.

# ఛత్తీస్‌గఢ్‌లో మావోల ఘాతుకం.. భద్రతాసిబ్బందిపై దాడి.. ముగ్గురు దుర్మరణం..!

న్యూఢిల్లీ, జనవరి 30:ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు ఘాతుకానికి ఒడిగట్టారు. మంగళవారం బీజాపూర్-సుక్మా సరిహద్దులో భద్రతాసిబ్బందిపై ఒక్కసారిగా దాడికి పాల ్పడ్డారు. ఈ దాడిలో ముగ్గురు భద్రతాసిబ్బంది మృతిచెందారు. మరో 14 మందికి గాయాలయ్యాయి. గాయపడిన భద్రతాసిబ్బందని మెరుగైన చికిత్స కోసం హెలిక్యాప్టర్లలో రాయ్‌పూర్ ఆస్పత్రికి తరలించారు.

మావోయిస్టు కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు బీజపూర్-సుక్మా సరిహద్దులోని టేకల్‌గూడెం గ్రామంలో ఇవాళ సెక్యూరిటీ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం భద్రతాసిబ్బంది.. మావోయిస్టుల కోసం కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎన్‌కౌంటర్ చోటుచేసకుంది. సెక్యూరిటీ క్యాంప్‌పై మావోయిస్టులు కాల్పులు జరిపారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు.

# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఫిలిప్ గ్రీన్




హైదరాబాద్, జనవరి 30:ఆస్ట్రేలియన్ హై కమిషనర్ ఆఫ్ ఇండియా ఫిలిప్ గ్రీన్ మంగళవారం బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తెలంగాణలో విద్య అభివృద్ధి కార్యక్రమాలు, ఎకో టూరిజం విస్తరణకు ఉన్న అవకాశా లు, వ్యవసాయంలో అధునాతన సాంకేతిక విధానాలపైనా ఇరువురి మధ్య కాసేపు చర్చ జరిగింది. హైదరాబాద్ నుంచి అస్ట్రేలియాకు డైరెక్ట్ కనెక్టివిటీ మెరుగు పడాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై హైకోర్టు కీలక ఉత్తర్వులు

## -తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు కొత్త సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించవద్దు

హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరామ్, అమీర్ అలీఖాన్‌లను నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై రాష్ట్ర హైకోర్టు మంగళవారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం యథాతథ స్థితినే కొనసాగించాలని, తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు కొత్త సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించవద్దని తన ఆదేశాల్లో పేర్కొన్నది. దాంతో హైకోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా ప్రొఫెసర్ కోదండరామ్, అమీర్ అలీఖాన్‌లు ప్రమాణం చేయడానికి వీల్లేకుండా పోయింది. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్‌ఖాన్‌లను నియమించడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. దాంతో కోర్టు తాజా ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 8వ తేదీకి వాయిదా వేసింది. కాగా, కొద్ది నెలల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దాసోజు శ్రవణ్, సత్యనారాయణలను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు నామినేట్ చేసింది. అయితే గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వారి పేర్లను తిరస్కరించారు. అయితే గవర్నర్ తమ నియామకాలకు ఆమోదం తెలుపకపోవడంపై దాసోజు శ్రవణ్, సత్యనారాయణ రాష్ట్ర హైకోర్టుకు వెళ్లారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టికల్ 171 ప్రకారం తమను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసిందని.. దాన్ని తిరస్కరించే హక్కు గవర్నర్ లేదని వారు పేర్కొన్నారు. ఆ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈలోపే కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరామ్, అమీర్ అలీఖాన్‌లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించడం, గవర్నర్ ఆమోదం తెలపడంపై దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టుకు వెళ్లారు.

# అదే అమరవీరులకు మనమిచ్చే అసలైన నివాళి : మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్, జనవరి 30:దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టడమే మనం వారికిచ్చే అసలైన నివాళి అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అమరవీరుల దినోత్సవం (మహాత్మాగాంధీ వర్ధంతి-జనవరి 30) సందర్భంగా దేశం కోసం పోరాడుతూ అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను మంత్రి స్మరించుకున్నారు. గాంధీజీ, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి ఎందరో దేశభక్తులు భరతజాతి విముక్తికై తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి, చరిత్రలో అజరామరమైన స్థానాన్ని పొందారని అన్నారు. దేశం పై ప్రేమతో అసమానమైన పోరాట తీరును ప్రదర్శించిన మరెందరో వీరుల తెగువ, పోరాట పటిమ ప్రజల గుండెల్లో గూడు కటుకొని ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ఎందరో అమరుల త్యాగాలతో మహోన్నత దేశంగా రూపుదిద్దుకున్న భారతదేశాన్ని విచ్ఛిన్నకర శక్తుల నుంచి కాపాడేందుకు దేశ ప్రజలు, యువత పిడికిళ్లు బిగించాలని, అప్పుడే అమరవీరుల త్యాగాలకు సార్థకత చేకూరుతుందని మంత్రి సురేఖ పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలు, ఆదర్శాలు, సిద్ధాంతాలే ప్రేరణగా దేశ పురోగమనానికి ప్రజలంతా ఏకమై ఉక్కు సంకల్పంతో ముందుకు సాగినప్పుడే మహోజ్వల భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని మంత్రి స్పష్టం చేశారు.

# గ్రామాల్లో తాగునీటి నిర్వహణ విధులు సర్పంచ్‌లకే.. సీఎం కీలక నిర్ణయం



హైదరాబాద్, జనవరి 30: గ్రామాల్లో తాగునీటి నిర్వహణ విధులను సర్పంచులకు అప్పగించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇంటింటికీ నీళ్లను అందించే బాధ్యతను వాళ్లకే ఇవ్వాలని అన్నారు. అందుకు అవసరమైన విధివిధానాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. గ్రామాల వరకు రక్షిత మంచి నీటిని సరఫరా చేసే బాధ్యతను మిషన్ భగీరథ విభాగవే తీసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డితో కలిసి సంబంధిత విభాగాల అధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ, నల్లాలు, పైపులైన్ల మెయింటెనెన్స్ మాత్రమే విడిగా సర్పంచులకు అప్పగించాలని ఈ సందర్భంగా సీఎం చెప్పారు. నెలాఖరుతో సర్పంచుల పదవీకాలం ముగిసిపోతుందని, ఆ తర్వాత అధికారులే తాగునీటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని సీఎం సూచించారు.

వచ్చే వేసవికాలంలో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కేవలం గోదావరి, కృష్ణా నదుల నుంచే రాష్ట్రమంతటికీ నీళ్లు ఇవ్వటం కాకుండా, కొత్తగా ఏర్పడ్డ రిజర్వాయర్లను తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. అందుకు అనుగుణంగా కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. దీంతో చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు తాగు నీటిని సరఫరా చేయటం సులభమవుతుందని, తక్కువ ఖర్చుతో సాధ్యమవుతుందని అన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయక్ సాగర్ లాంటి కొత్తగా ఏర్పడ్డ రిజర్వాయర్లన్నింటినీ తాగునీటికి వాడుకోవాలని అన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ డెవెలప్‌మెంట్ ఫండ్ కింద కేటాయించిన రూ.10 కోట్లలో ఒక కోటి రూపాయలను తాగునీటి అవసరాలకు ఖర్చు చేయాలని ఆదేశించారు.

రాష్ట్రంలో ఉన్న స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని, వాళ్లకు ఆర్థికంగా చేయూతను అందించే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థినీవిద్యార్థులు, పోలీసులకు అందించే యూనిఫాంలు కుట్టించే పనిని ఈ సంఘాల మహిళలకు అప్పగించాలని సూచించారు. అవసరమైతే తగిన శిక్షణను ఇచ్చి వారిని ప్రోత్సహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

# గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలి : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్, జనవరి 30:అహింస మార్గంలో దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన గొప్ప మహానీయుడు మహాత్మా గాంధీజీ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడలో ఉన్న విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ప్రతి ఒక్కరూ గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సహనం, ఓర్పు , అహింసా మార్గాలతో దేశ ప్రజలకు విముక్తి కల్గిందన్నారు.

అనంతరం చందన చెరువు కట్టపై మొక్కలు నాటి పచ్చదనం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కందుకూరు జడ్పీ టీసీ జంగారెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, అనిల్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు అర్కల కామేష్ రెడ్డి, రాజ్‌కుమార్, ప్రభాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# బి అర్ ఎస్ చచ్చిన పార్టీ ..బిజెపితోనే మా పోటీ .. రేవంత్



హైదరాబాద్, జనవరి 30:తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ చచ్చిపోయిందని, పార్లమెంట్ ఎన్నికల్లో తమ పోరు బీజేపీతోనే టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు..బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మూసీలో వేసినట్లేనన్నారు. బావ, బామ్మర్దులు ఇటీవల బీజేపీని పల్లెత్తుమాట అనకుండా కాంగ్రెస్‌ను విమర్శించడమే బీఆర్ఎస్, బీజేపీ ఒకటేననడానికి నిదర్శనమని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలపై మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ మీటింగ్ తర్వాత రేవంత్ మీడియాతో మాట్లాడారు.

మోదీని మూడోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ప్రయత్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 17 సీట్లు గెలవాల్సిందే. కేంద్రంలో కాంగ్రెస్ గెలిస్తేనే విభజన హామీలు పరిష్కారం అవుతాయి. పదేళ్లలో విభజన హామీలను కేసీఆర్ అడగలేదు. మోదీ నెరవేర్చలేదు. రాహుల్ గాంధీ నాయకత్వం దేశానికి అవసరం. భారత్ జోడో న్యాయ యాత్ర చేస్తున్న రాహుల్ గాంధీపై కేటీఆర్ విమర్శలు చేయడం సరికాదు.

పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థుల ఎంపిక ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు అప్పగించాం. త్వరలో ఎంపీ ఎన్నికలకు అప్లికేషన్లు స్వీకరిస్తాం. ఎన్నికల సెలక్షన్ కమిటీ ఏర్పాటు చేశాం. కమిటీకి గుజరాత్ నేత జిగ్నేష్ మెవానీ అధ్యక్షత వహిస్తారు. ఫిబ్రవరి 15 నుంచి 20 లోపు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) లోక్‌సభ అభ్యర్థులపై నిర్ణయం తీసుకుంటుంది. ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లిలో ఏర్పాటు చేసే సభతో పార్లమెంట్ ఎన్నికలకు సమరశంఖం పూర్తిస్తాం'అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# జార్ఖండ్‌లో ఇద్దరు తోటి టీచర్లను కాల్చి చంపిన ప్రభుత్వ టీచర్

రాంచీ, జనవరి 30: జార్ఖండ్‌లోని గొడ్డ జిల్లాలో దారుణం జరిగింది. ఓ ప్రభుత్వ స్కూల్ టీచర్(బఞష్ట్రనీనీశ్రీ బివజీఞష్ట్రవతీ).. తన వద్ద ఉన్న గన్‌తో కాల్పులు జరిపాడు. ఆ కాల్పుల్లో ఇద్దరు తోటి టీచర్లు మృత్యువాతపడ్డారు. ఆ తర్వాత తనను తాను కాల్చుకున్నాడు. రాంచీ నుంచి 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొరయ్యాహట్ ఏరియాలో ఉన్న అప్‌గ్రేడ్ హై స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. ఉదయం 11 గంటలకు పాఠశాల తరగతులు జరుగుతున్న సమయంలోనే ఆ టీచర్ కాల్చివేతకు తెగించాడు. గొడ్డ ఎస్పీ నాథూ సింగ్ మీనా మీడియాతో మాట్లాడుతూ.. ఇద్దరు టీచర్ల మృతదేహాలు రక్తపుమడుగులో ఉన్నాయని, అందులో ఓ మహిళ మృతదేహం కూడా ఉందని ఆయన తెలిపారు. కాల్పులు జరిపిన టీచర్ తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు.

## అదరగొట్టిన యువ భారత్.. న్యూజిలాండ్‌పై భారీ విజయం !

న్యూఢిల్లీ, జనవరి 30:దక్షిణాఫ్రికా వేదికగా జరుగుతున్న ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్‌లో భారత్ మరోసారి భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. గ్రూప్ దశలో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన భారత్.. సూపర్ సిక్స్‌లో దశలోనూ తమ తొలి మ్యాచ్‌లో అదరకొట్టింది. బ్లూమ్‌ఫోంటైన్ వేదికగా ఇవ్వాల (మంగళవారం) న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 214 పరుగుల తేడాతో గెలుపొందింది యువ భారత్. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 295 పరుగులు చేసింది. ఇక చేజింగ్‌కు దిగిన న్యూజిలాండ్ జట్టును 81 పరుగులకే ఆలౌట్ చేసింది


నేటి కందం- నేటికి అందం

ఘనమగు శంకర నారా
యణుని నిఘంటువు తెలుగుల యశమును బెంచన్
జనవరి ముప్పదియొకటిన
గొనె ప్రణతి మరొక్కమారు గుణగణ్యులచేన్



(31-1-1953 శంకర నారాయణ డిక్షనరీ రెండవ మారు విస్తరణతో ముద్రింపబడినరోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

# దైవ ప్రార్థన కన్న మానవ సేవయే మిన్న !

## (31 జనవరి 'మెహర్ బాబా వర్ధంతి' సందర్భంగా)

20వ శతాబ్దపు మెహర్ బాబా 'కారుణ్య పిత'గా పిలువబడుతూ, ఉద్యమ కేంద్ర బిందువుగా నిలిచి, ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన మిలియన్ల శిష్యగణంచే 'అవతార్ (మానవుడి రూపంలో మాధవుడు)'గా కొలువబడ్డాడు. భారతీయ ఆధ్యాత్మిక గురువైన మెహర్ బాబా మహారాష్ట్ర పూనెలోని ఇరానీ జొరాస్ట్రియన్ కుటుంబంలో 25 ఫిబ్రవరి 1894న శేరియార్ ఇరానీ – షిరీన్ ఇరానీలకు 2వ కుమారుడిగా జన్మించారు. బాలుడికి తల్లితండ్రులు పెట్టిన పేరు మెర్వన్ షెరియర్ ఇరానీ. తన చిన్నతనం నుంచే మంచి కవి, సంగీత వాయిద్యకారుడిగా ఎదుగుతూనే బహుభాషావేత్తగా కాస్మోపాలిటన్ క్లబ్‌ను స్థాపించారు. మెహర్ బాబా 19వ ఏట నుంచి 7 సంవత్సరాలు ప్రముఖ ఆధ్యాత్మిక గురువులైన హజ్రత్ బాబాజన్, ఉపస్నీ మహారాజ్, షిరిడీ సాయి, తాజుద్దీన్ బాబా, నారాయణ్ మహరాజ్‌లను 'ఫర్‌ఫెక్ట్ మాస్టర్స్'గా భావించి, ఆ ఆధ్యాత్మిక గురువులతో సన్నిహితంగా మెదిలి పరివర్తనం చెందారు.

### విచారం వద్ద సంతోషమే ముద్దు (డోన్ట్ వర్రీ బీ హాపీ):

10 జూలై 1925 నుండి మౌనవ్రతం ప్రారంభించి 44 ఏండ్ల పాటు వ్రాత, సైగలతోనే బోధనలు చేశారు. సూఫీ, వేదిక్, యోగ శాస్త్రాలను మేళవించి మానవ జీవనసారాన్ని, జీవన లక్ష్యాలను ప్రభావవంతంగా బోధించారు నాటి అవతార్ మెహర్ బాబా. ప్రతి ఆత్మ పరమాత్మ స్వరూపమని, అందరిలో దేవుడు ఉన్నాడని తన ఉపన్యాసాలను అందించారు. 'గాడ్ స్పీక్స్' అనే పుస్తకాల ద్వారా తన సందేశాలను భక్తకోటికి అందించారు. తన బోధనల్లో మాదకద్రవ్యాల దుర్వినియోగం, పునరావాసం, మానసత్త్వశాస్త్రం, మెటాఫిజిక్స్ లాంటి మేధో అంశాలు ఉండేవి. తన శిష్యులు ఏర్పాటు చేసిన 'అవతార్ మెహర్ బాబా చారిటబుల్ ట్రస్ట్' ద్వారా బాబా బోధనలను నేటితరాలకు అందుబాటులో ఉంచారు. 'డోన్ట్ వర్రీ, బీ హాపీ' అనే నినాదంతో తన బోధనలను విశ్వవ్యాప్తం చేశారు. 1920ల్లో అహ్మద్‌నగర్ సమీపంలో మెహరాబాద్ (దీవెనల వనం) ఆశ్రమాన్ని స్థాపించి పాఠశాలలు, ఆసుపత్రులు ఉచితంగా నిర్వహించారు. కుష్టురోగులు, వికలాంగులు, దళితులు, పేదలకు ఉచిత సేవలు చేశారు. 1931 నుండి యూరప్, అమెరికా, ఇంగ్లాండ్‌లలో పర్యటించి శిష్యమండలికి ఉపన్యాసాలు అందిస్తూనే పలు ప్రముఖులను కలిసే వారు బాబా. గాంధీతో మూడుసార్లు కలిసి తన అభిప్రాయాలను పంచుకున్నారు.


### మౌనంతో మానవత్వ పరిమళాల పంపకం:

1949 – 1952 మధ్య కొద్ది మంది శిష్యులతో కలిసి 'న్యూ లైఫ్' సిద్ధాంతంతో తన అదీనంలో ఉన్న ఆస్తులను విడిచి బాబా బోధనలను భారతమంతా వినిపించారు. 31 జనవరి 1969న మెహరాబాద్ ఆశ్రమంలో 'నేను దేవుడి అవతారమని మరువకండి' అని సూచిస్తూ తుది శ్వాస విడిచారు. బాబా శిష్యులు తన వర్ధంతిని 'అమరతిథి (మరణంలేని దినం)'గా పాటిస్తారు. బాబా పార్థివదేహాన్ని గులాబీలు, మంచు గడ్డలతో కప్పి వారం రోజులు శిష్యుల అంతిమ దర్శనానికి అందుబాటులో ఉంచారు. మెహరాబాద్‌లోని బాబా సమాధి నేటికీ దర్శనీయ స్థలంగా ప్రసిద్ధి పొందింది. 'ది అవేకనర్ (మేలుకొలిపే వాడు)'గా పిలువబడిన మెహర్ బాబా రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, క్రీస్తు, మహ్మద్ ప్రవక్తలు ఒక్కరే అని ప్రభోదించారు. 'అవసరార్థులకు సేవ చేయడం అన్ని ప్రార్థనల కన్న మిన్న' అని బోధించిన బాబా 'చింతించకండి, సంతోషంగా ఉండండి' అంటూ మానవాళికి పిలుపునిచ్చారు. మౌనంతోనే మానవత్వాన్ని, జీవనతత్వాన్ని, జీవిత పరమార్థన్ని బోధించిన మెహర్ బాబా జీవితం నేటి యువతకు దీప స్తంభం కావాలని ఆశిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# శాంతమ్మ మృతదేహానికి నివాళులర్పించిన వైరా ఆత్మకమిటీ చైర్మన్



ఖమ్మం, జనవరి 30:(నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ నాయకులు వింజనీ మోహన్ రావు అత్తగారైన చిగురు శాంతమ్మ అనారోగ్య కారణంతో అకాల మరణం పొందినారు, మంగళవారం వారి స్వగ్రామం కారేపల్లి మండలం గాంధీనగర్ నందు వారి పార్థివ దేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపిన వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, తూము అప్పారావు, నల్లమోతు లక్ష్మయ్య, వింజనీ రమేష్, తదితరులున్నారు.

# కోటి రూపాయలు స్వాధీనం- ఇద్దరు అరెస్టు

అమరావతి, జనవరి 30: ఏపీలో కోటి రూపాయలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జాతీయ రహదారిపై టోల్ గేట్ సమీపంలో మంగళవారం జరిగింది. ప్రకాశం జిల్లా టంగుటూరు సమీపంలోని టోల్ గేట్ సింగరాయకొండ సీఐ రంగనాథ్ వాహనాలు తనిఖీ చేపట్టారు.

ఈ సమయంలో మద్రాసు నుంచి గుంటూరు వైపు వస్తున్న వాహనంలో ఆధారాలు లేకుండా తరలిస్తున్న కోటి రూపాయలను పట్టుకున్నారు. ఆ కారును స్వాధీనం చేసుకుని డ్రైవర్ తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

# స్టార్టప్ ఇండియా ఇన్నోవేషన్ వీక్ లో భాగంగా పీయూష్ గోయల్ 40 యునికార్న్‌లతో రౌండ్ టేబుల్ సమావేశం

న్యూఢిల్లీ, జనవరి 30:స్టార్టప్ ఇండియా ఇన్నోవేషన్ వీక్ సందర్భంగా కేంద్ర వాణిజ్యం పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజాపంపిణీ మరియు జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ యూనికార్న్ రౌండ్ టేబుల్‌కు అధ్యక్షత వహించారు. మన దేశంలో ఎక్కువ యునికార్న్లు ఉన్నాయని పాల్గొన్న 40 యునికార్న్‌లు వారి అనుభవం నుండి వారి అభ్యాసాలు వారి పెరుగుదలకు దోహదపడిన అంశాలు భారతదేశ వర్యావరణ వ్యవస్థ వృద్ధిని పెంచడానికి గుర్తించిన రంగాలు దేశాన్ని గ్లోబల్ స్టార్టప్ లీడర్‌గా ఎదగడంలో సహాయపడతాయని ఆయన అన్నారు. శ్రీ పీయూష్ గోయల్ యునికార్న్‌లు ఏకతాటిపైకి వచ్చి దేశంలోని స్టార్టప్‌లకు మూలధనాన్ని పొందేందుకు పరిష్కారాలను అందించే యునికార్న్ క్లబ్ లేదా అసోసియేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సంభాషణ మరింత స్టార్టప్ స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించడానికి నియంత్రణ ప్రక్రియలను క్రమబద్ధీకరించడం, టైర్-2/3 నగరాల్లో యాక్సెస్‌ను పెంచడం మరియు ప్రైవేట్ రంగంలోని ఆర్థిక సంస్థలు ఏర్పాటు చేసిన ఉత్తమ పద్ధతుల నుండి నేర్చుకోవడంపై దృష్టి సారించింది.

పరిశ్రమ మరియు అంతర్గత వాణిజ్య ప్రమోషన్ విభాగం (డీ పీ ఐ ఐ టీ), ఈ సంవత్సరం, దేశంలోని కీలక స్టార్టప్‌లు, వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు మరియు ఇతర వాటాదారులతో కలిసి ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకతపై దేశవ్యాప్తంగా 10 జనవరి 2024 నుండి 18వ తేదీ వరకు ఇన్నోవేషన్ వీక్ ను జరుపుకున్నారు. 'స్టార్టప్‌శాల' – స్టార్టప్ ఇండియా యొక్క యాక్సిలరేటర్ ప్రోగ్రామ్, ప్రారంభ దశ స్టార్టప్‌ల కోసం 3-నెలల సుదీర్ఘ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్, వారికి విజ్ఞానం, నెట్‌వర్క్, నిధులు మరియు ప్రగతి కి అవసరమైన మార్గనిర్దేశంను అందిస్తుంది. ప్రోగ్రామ్‌లోని ప్రతి బృందం ఒక నిర్దిష్ట రంగంపై దృష్టి సారిస్తుంది, మొదటిది క్లీన్‌టెక్ మరియు ప్రతి 20 స్టార్టప్‌లకు ఒక కోహోర్ట్ చప్పున ఓపెన్ కాల్ అప్లికేషన్ నుంచి నిపుణులచే ఎంపిక చేయబడతాయి. అప్లికేషన్‌లు 10 జనవరి 2024 నుండి స్టార్టప్ ఇండియా హబ్‌లో తెరవబడ్డాయి:

విద్యార్థులు మరియు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రేరేపించడానికి, 'ఎలా ప్రారంభించాలి' అనే అంశంపై దృష్టి సారించిన 5 అంకితమైన వెబ్‌నార్లు, వర్ధమాన పారిశ్రామికవేత్తల కోసంమార్గ మెంటర్‌షిప్ సిరీస్ పేరుతో నిర్వహించబడ్డాయి. పరిశ్రమ నాయకులు మరియు మార్గదర్శకులు స్టార్టప్‌ను ప్రారంభించటానికి అవసరమయ్యే ప్రాథమిక అంశాల గురించి అంతర్దృష్టులు మరియు కీలక పాఠాలను పంచుకున్నారు. ఈ సెషన్లన్నీ స్టార్టప్ ఇండియా సోషల్ మీడియా హ్యాండిల్స్‌తో పాటు యువ పారిశ్రామికవేత్తల కోసం మైభారత్ (ఓజఃప్రజీతీజీబి) పోర్టల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయబడ్డాయి.

స్టార్టప్ ఇండియా ఇన్నోవేషన్ వీక్ యొక్క 75+ ఫిజికల్ ఈవెంట్‌లు వ్యవస్థాపకతకు ఉత్ప్రేరకంగా పనిచేశాయి, భారతదేశం యొక్క అభివృద్ధి చెందుతున్న పర్యావరణ వ్యవస్థను ప్రదర్శిస్తాయి మరియు అసంఖ్యాక ఔత్సాహిక వ్యవస్థాపకుల కలలను రేకెత్తించాయి. మహిళా పారిశ్రామికవేత్తలకు సాధికారత కల్పించే వర్క్‌షాప్‌ల నుండి ఇంక్యుబేటర్ ఛాంపియన్‌ల కోసం శిక్షణకు ఈ వారంలో మెంటార్‌లు మరియు మెంటీలు విజ్ఞానాన్ని పంచుకోవడం, ఔత్సాహిక పయినీర్లకు స్ఫూర్తి ఇచ్చింది. భవిష్యత్ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను రూపొందించే అనుబంధాలను ఏర్పరుచుకుంటూ, వాటాదారుల చర్చలతో అనేక నగరాల్లో అనేక ఆలోచనలను రేకెత్తించే రౌండ్ టేబుల్‌లు నిర్వహించబడ్డాయి.

కార్పొరేట్‌లతో స్టార్టప్‌ల యొక్క మెంటర్‌షిప్ కూడా వారం ప్రారంభంలో ప్రారంభించబడింది. ఈ సిరీస్‌లో ఆర్థిక రుణాలు మరియు మద్దతు, కార్యకలాపాలు, స్థిరమైన ఆవిష్కరణలు మరియు నూతన సాంకేతికత డొమైన్‌లలో కార్పొరేట్‌లతో షార్ట్‌లిస్ట్ చేయబడిన స్టార్టప్‌లకు ప్రత్యేకమైన చేయూత మరియు మార్గదర్శకత్వం ఉన్నాయి. హెచ్‌సిఎల్, హెచ్‌ఎస్‌బిసి ఇండియా, క్వాల్‌కామ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మరియు టిసిఎస్ ఫౌండేషన్లు కార్పొరేట్ ఆవిష్కరణ మరియు సుస్థిరత్వం గురించి మరింత అవగాహన కల్పించడానికి, స్టార్టప్ ఇండియా యొక్క ప్రపంచ భాగస్వాములతో వర్చువల్ ప్యానెల్ చర్చ నిర్వహించబడింది. ఇన్‌క్యుబేషన్, పెట్టుబడి మరియు రుణాలు, పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడల్, మార్కెట్ అందుబాటు మరియు గవర్నమెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో సహా ఇన్నోవేషన్ యొక్క 5 కీలక స్తంభాలపై ప్యానెల్ దృష్టి సారించింది. ప్రభుత్వ ఇ-మార్కెట్‌ప్లేస్ (జీ ఈ ఎం)లో స్టార్టప్‌లకు అందుబాటులో ఉన్న ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు మహారాష్ట్రలోని ముంబైలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించబడింది. 9 జనవరి 2024న తెలంగాణాలోని హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ కొనుగోళ్ల పై వర్క్‌షాప్ కూడా నిర్వహించింది, ఇందులో 70 మంది పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# సి-డాట్‌ను సందర్శించిన రక్షణ, పర్యాటకశాఖ సహాయ మంత్రి అజయ్‌భట్



న్యూఢిల్లీ, జనవరి 30: రక్షణఢ పర్యాటక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీ అజయ్ భట్ సోమవారంనాడు ఢిల్లీ క్యాంపస్‌లో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సి-డాట్)ను సందర్శించారు. కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖకు చెందిన టెలికమ్యూనికేషన్స్ విభాగపు అగ్ర టెలికాం ఆర్‌డడి కేంద్రం సి-డాట్. అది రక్షణ కమ్యూనికేషన్లు ఢ సైబర్ భద్రతకు అవసరమైన కీలక మౌలిక సదుపాయాలకు అవసరమైన దేశీయ, సురక్షిత పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు చురుకుగా పని చేస్తోంది.

ఈ సందర్భంగా రక్షణ ఢ పర్యాటక మంత్రిత్వ శాఖల సహాయమంత్రి శ్రీ అజయ్‌భట్ సి-డాట్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం, విభిన్న టెలికాం ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో / పరిష్కారాలు, భద్రతా నిర్వహణ కేంద్రం (నెట్‌వర్క్‌లో మాల్‌వేర్‌ను నిజ-సమయంలో గుర్తించేందుకు), వ్యవస్థ భద్రతా కేంద్రం (చరవాంశాలను ఆవరిస్తూ సంస్థాగత స్థాయిలో హానికరమైన బెదిరింపులను దాడులను నిజ సమయంలో గుర్తించి, తగ్గించడం), క్వాంటం కీ డిస్ట్రిబ్యూషన్, పోస్ట్ క్వాంటం క్రిప్టోగ్రఫీ పై సందర్శించిన గౌరవఅతిథికి సి-డాట్ సిఇఒ డాక్టర్ రాజ్‌కుమార్ ఉపాధ్యాయ వివరణాత్మక ప్రెజెంటేషన్‌ను అందించారు.

దేశీయంగా అభివృద్ధి చేసిన 4జి కోర్ ఢ 4జి రాన్, 5జి కోర్ ఢ 5జి రాన్, విపత్తు నిర్వహణ పరిష్కారం, సెల్ ప్రసార కేంద్రం, ఆప్టికల్ రవాణా ఢ పరిష్కారం అందుబాటు, దిశను మార్చడం ఢ రూటింగ్ పరిష్కారాలు, తదితరాలను కూడా ప్రదర్శించారు.

దీని అనంతరం, సి-డాట్ వీడియో కాన్ఫరెన్సింగ్ (విసి) పరిష్కారాలు ఢ దేశీయంగా అభివృద్ధి చేసిన మెస్సేజింగ్ ఢ సెల్ వేదిక సంవాద్, పోస్ట్ క్వాంటం క్రిప్టోగ్రఫీ, విపత్తు నిర్వహణ సిఎంపి(సామాన్య ప్రొటోకాల్ అప్రమత్తత) ఢ వ్యవస్థ భద్రతా నిర్వహణ కేంద్రం (ఇఎస్‌ఒసి), డిడబ్ల్యుడిఎం ఢ ఒటిఎన్ లాబ్, క్వాంటం కీ డిస్ట్రిబ్యూషన్ (క్యూకెడి), జిపిఒఎన్/ ఎన్‌ఎంఎస్, 4జి/ 5జి ప్రయోగశాల, ఇ-శిక్ష ఢ సిఎస్ఎటి-ఫైలాబ్, టెలికాం భద్రతా నిర్వహణ కేంద్రం ఢ 5జి ప్రదర్శన జరిగాయి.

ఢిల్లీ కాంపస్‌లోని సి-డిటియన్లను, ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో పాల్గొన్న బెంగళూరుకు చెందిన సి-డాట్ సిబ్బందిని ఉద్దేశించి రక్షణ ఢ పర్యాటక శాఖల సహాయమంత్రి శ్రీ అజయ్‌భట్ ప్రసంగించారు.

అది అంతర్దృష్టితో కూడిన సంభాషణ, పరస్పర చర్య. రక్షణ రంగంలో టెలికాం గొప్ప పాత్రను పోషిస్తుంది. సి-డాట్‌కు, భారత రక్షణ దళాల మధ్య అనేక రంగాలలో సహకరించుకునే అవకాశాలను నేను చూస్తున్నాను అని ఆయన పేర్కొన్నారు. రక్షణ స్వదేశీకరణలో సి-డాట్ భాగమై, రక్షణ రంగంలో టెలికాం ఢ సైబర్‌సెక్యూరిటీలో పరివర్తన తేవడంలో గొప్ప పాత్ర పోషించవచ్చని అన్నారు. రక్షణ రంగానికి ప్రత్యేకంగా సరిపోయే సురక్షిత పరిష్కారాలు, సాంకేతికతల అభివృద్ధి కోసం సి-డాట్ – రక్షణ దళాల మధ్య మరింత సహకారం కోసం శ్రీ అజయ్‌భట్ జీ పిలుపిచ్చారు.

తన విలువైన మార్గదర్శనాన్ని ఇచ్చి, సి-డాట్ ఇంజినీర్లకు ప్రేరణ కలిగించినందుకు రక్షణ సహాయమంత్రికి సి-డాట్ సిఇఒ డాక్టర్ ఉపాధ్యాయ కృతజ్ఞతలు తెలిపారు. రక్షణ రంగం కోసం అనుకూలించిన అత్యాధునిక టెలికాం భద్రతా పరిష్కారాలను అభివృద్ధి చేయాలన్న నిబద్ధతకు సి-డాట్ కట్టుబడి ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

రక్షణ ఢ పర్యాటక సహాయ మంత్రి శ్రీ అజయ్‌భట్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, సి-డాట్ టెలికమ్యూనికేషన్ల సైబర్ భద్రత నెట్‌వర్క్‌లు సహా టెలికమ్యూనికేషన్ల రంగంలోని అన్ని అంశాలలో అద్భుతమైన పని చేసిందని, దానిని కొనసాగిస్తోందని అన్నారు. సి-డాట్, రక్షణ ఏజెన్సీలు కలిసి పని చేసే గొప్ప భవిష్యత్తును నేను దర్శిస్తున్నాను. సి-డాట్ భవిష్యత్ కృషికి నా శుభాభినందనలు చెప్తున్నాను అన్నారు. సాంకేతిక పురోగతిలో ఢ దాని వినియోగంలో 2047 నాటికి భారత్ విశ్వగురువు అవుతుందన్నారు. పౌర ఢ రక్షణ వినియోగానికి అత్యాధునిక సాంకేతికతలను అమలు చేయడంలో సి-డాట్ కు కీలక పాత్ర ఉంటుందన్నారు.

సి-డాట్ దేశానికి అత్యున్నత సేవ చేస్తోంది. సి-డాట్ తన అన్ని ప్రయత్నాలలో సఫలం కావాలని శుభాకాంక్షలు తెలుపుతున్నానని చెప్పారు.

# ఎనిమిదియేండ్ల కల సహకారమైన వేళ...!

## – మంత్రి తుమ్మల చొరవతో ఎన్వి బంజరకు బస్సుసర్వీస్




ఖమ్మం, జనవరి 30:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండల పరిధిలోని ఎన్వి బంజర గ్రామానికి గత 8 సంవత్సరాలుగా బస్సు సౌకర్యం లేక చింతల్ తండా, ఎన్వి బంజర, రాజుపల్లి నగర్ గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని మంగీలాల్ చౌహన్, జర్పుల అనిల్, గ్రామ ప్రజలు తుమ్మల యుగేందర్ దృష్టికి తీసుకెళ్లారు. తుమ్మల యుగేందర్ వెంటనే స్పందించి మంత్రి తుమ్మల నాగేశ్వరావు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మారుమూల గ్రామాలైన ఎన్వి బంజర, రాచేపల్లి నగర్ లకు బస్సు సౌకర్యం కల్పించాలని డిపో ఆర్ఎం డిఎంతో మాట్లాడి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మలకు ఆ గ్రామాల ప్రజలు ధన్యవాదములు తెలిపారు. అదేవిధంగా ఇదే బస్సును గద్దలగూడెం, అరికెలపాడు వరకు నడిపించాలని అరికెలపాడు ప్రజలు కోరుతున్నారు.

# ఫిబ్రవరి 16న తిరుమలలో రథసప్తమి..

తిరుపతి, జనవరి 30:సూర్య జయంతి సందర్భంగా ఫిబ్రవరి 16వ తేదీన తిరుమలలో రథసప్తమి పర్వదినం జరుగనుంది. ఈ సందర్భంగా ఏడు వాహనాలపై స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. పవిత్రమైన మాఘ మాసంలో శుక్ల పక్ష సప్తమి తిథిని రథ సప్తమి లేదా మాఘ సప్తమి అని పిలుస్తారు. ఈ పరమ పవిత్రమైన రోజున సూర్యదేవుడు జన్మించాడని, ప్రపంచం మొత్తానికి జ్ఞానం ప్రసాదించాడని వేదాల ద్వారా తెలుస్తోంది. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని భారీ సంఖ్యలో తిరుమలకు విచ్చేసే భక్తుల కోసం టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేస్తోంది. రథసప్తమిని మినీ బ్రహ్మోత్సవాలు అని కూడా అంటారు.

### వాహనసేవల వివరాలు :

తెల్లవారుజామున 5.30 నుంచి 8 గంటల వరకు (సూర్యోదయం ఉదయం 6.40 గంటలకు) – సూర్యప్రభ వాహనం

ఉదయం 9 నుంచి 10 గంటల వరకు – చిన్నశేష వాహనం

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు – గరుడ వాహనం

మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు – హనుమంత వాహనం

మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు – చక్రస్నానం

సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు – కల్పవృక్ష వాహనం

సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు – సర్వభూపాల వాహనం

రాత్రి 8 నుంచి 9 గంటల వరకు –చంద్రప్రభ వాహనం

### ఆర్జిత సేవలు రద్దు :

ఈ పర్వదినం కారణంగా ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. కాగా, సుప్రబాతం, తోమాల, అర్చన ఏకాంతంలో నిర్వహిస్తారు.

# ఏనాడైనా తాము తప్పు చేశామని భావిస్తే తమకు ఓటు వేయవద్దు




అమరావతి జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):ఏపీ అసెంబ్లీ ఎన్నికల ముందు మంత్రి బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏనాడైనా తాను గానీ.. తన పార్టీ నేతలు గానీ తప్పు చేశామని భావిస్తే తమకు ఓటు వేయొద్దని బొత్స ప్రజలకు సూచించారు.

విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న బొత్స సత్యనారాయణ ఈ వ్యాఖ్యలు చేశారు.ఏ తప్పు చేయకుండా నిజాయతీతో రాజకీయాలు చేశామన్న ధైర్యం తమకు ఉందని బొత్స సత్యనారాయణ తెలిపారు. అందుకే తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచానని తెలిపారు. తన సతీమణి ఝాన్సీని రెండుసార్లు, రవిబాబును ఒకసారి ఎంపీగా గెలిపించారని అన్నారు. ఇప్పుడు నాలుగోసారి మళ్లీ మీ ముందుకు వస్తున్నానని తెలిపారు. ఈసారి కూడా భారీ మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్నానని తెలిపారు.

# రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన హెడ్ కానిస్టేబుల్

ఖమ్మం జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూ న్);: కుటుంబ ఆస్తుల వివాదంలో నోటీసు ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన హెడ్ కానిస్టేబుల్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం రెండో పట్టణ పీఎస్‌లో రైటర్‌గా పని చేస్తున్న కోటేశ్వరరావు ఓ కుటుంబ ఆస్తుల వివాదంలో నోటీసు ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేశాడు. బాధితులు చేసేదేమి లేక ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సోమాలియా సముద్ర దొంగల బారి నుంచి 19 మంది పాకిస్తాన్ జాతీయులను రక్షించిన భారత నౌకా దళం



న్యూఢిల్లీ, జనవరి 30:సముద్ర దొంగల బారి నుంచి ఇరాన్ కు చెందిన మత్స్యకార ఓడ ఇమాన్ ను రక్షించిన భారత నౌకా దళానికి చెందిన ఐఎన్ఎస్ సుమిత్ర మరోసారి రంగంలోకి దిగి సోమాలియా తూర్పు తీరంలో పాకిస్తాన్ కు చెందిన మత్స్యకార ఓడ ఇమాన్ ను,దానిలో పనిచేస్తున్న 19 మంది పాకిస్తాన్ జాతీయులను రక్షించింది.

తూర్పు సోమాలియా, గల్ఫ్ ఆఫ్ అడెన్ ప్రాంతంలో తీవ్రవాద కార్యక్రమాలు నిరోధించి, సముద్ర జలాల్లో రక్షణ చర్యలు చేపట్టడానికి భారత నౌకాదళం స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ఆఫ్ షోర్ పెట్రోలింగ్ నౌక ఐఎన్ఎస్ సుమిత్ర ను మోహరించింది. జనవరి 28న పీఎం 28న ఇరాన్ కు చెందిన మత్స్యకార ఓడ (ఎఫ్ వీ) ని ఇమాన్ ను సముద్రపు దొంగలు హైజాక్ చేసి సిబ్బందిని బందీలుగా పట్టుకున్నారని ఐఎన్ఎస్ సుమిత్ర కు అత్యవసర సందేశం అందింది. దీనికి స్పందించిన ఐఎన్ఎస్ సుమిత్ర రంగంలోకి దిగి మత్స్యకార ఓడ ఇమాన్ ను అడ్డుకుంది. ఎస్ఓపిలు , హెచ్చరికల ద్వారా నౌకను, నౌకలో పనిచేస్తున్న సిబ్బందిని (17 ఇరానియన్ జాతీయులు) జనవరి 29 తెల్లవారుజామున సురక్షితంగా రక్షించింది. నౌకను తనిఖీ చేసిన అనంతరం ప్రయాణం కొనసాగించడానికి అనుమతించారు. . ఎఫ్వీ ఇమాన్ను శానిటైజ్ చేసి డిశ్చార్జ్ చేశారు.

తాజాగా ఐఎన్ఎస్ సుమిత్రకు ఇరాన్ కు చెందిన మరో ఫిషింగ్ నౌక అల్ నయీమ్ ని సముద్ర దొంగలు స్వాధీనం చేసుకుని దానిలో పనిచేస్తున్న సిబ్బంది (19 మంది పాకిస్తానీ జాతీయులు) ని బందీలుగా తీసుకున్నట్టు సమాచారం అందించింది. వెంటనే రంగంలోకి దిగిన ఐఎన్ఎస్ సుమిత్ర అత్యంత వేగంగా స్పందించింది.

హైజాక్ అయిన నౌకను జనవరి 29న ఐఎన్ఎస్ సుమిత్ర అడ్డుకుంది. ఎస్ఓపిలు , హెచ్చరికలు జారీ చేసి సమర్థవంతమైన మోహరింపు ద్వారా సిబ్బందిని, నౌకను దొగల బారి నుంచి రక్షించింది. ఇరాన్ కు చెందిన నౌకలోకి ప్రవేశించిన ఐఎన్ఎస్ సుమిత్ర సిబ్బంది సోమాలియా సముద్రపు దొంగల చెర నుంచి బయటపడిన సిబ్బంది యోగక్షే మాలను తెలుసుకునేందుకు,నౌక పరిస్థితి తెలుసు కున్నారు.

36 గంటల కంటే తక్కువ సమయంలో ఐఎన్ఎస్ సుమిత్ర చేపట్టిన వేగవంతమైన, నిరంతర , అలుపెరగని ప్రయత్నాల ద్వారా కొచ్చికి పశ్చిమాన సుమారు 850 నానోమీటర్ల దూరంలో దక్షిణ అరేబియా సముద్రంలో హైజాక్ అయిన రెండు ఫిషింగ్ నౌకలకు (17 మంది ఇరాన్ జాతీయులు 19 పాకిస్తాన్ జాతీయాలు ) సంద్ర దొంగల నుంచి విముక్తి కలిగింది. వాణిజ్య నౌకలపై దాడి చేయడానికి హైజాక్ చేసిన రెండు నౌకలను ఉపయోగించడానికి జరిగిన ప్రయత్నాలను ఐఎన్ఎస్ సుమిత్ర, భగ్నం చేసింది.

సముద్రంలో నావికులు, నౌకల భద్రతను నిర్ధారించడానికి అన్ని సముద్ర ముప్పులకు వ్యతిరేకంగా వ్యవహరించడానికి భారత నావికాదళం ఈ ప్రాంతంలో తన నిబద్ధతను మరోసారి నిరూపించింది.

# భారత్ - మాల్దీవుల మధ్య నెలకొన్న దౌత్య పరమైన వివాదం

**–వారాల వ్యవధిలోనే దారుణంగా పడిపోయిన భారత్ పర్యతుల సంఖ్య**

న్యూ ఢిల్లీ ఆగష్టు 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్):భారత్ – మాల్దీవుల మధ్య నెలకొన్న దౌత్య పరమైన వివాదం తర్వాత మాల్దీవుల పర్యాటకం లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా రెండు దేశాల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో మాల్దీవులకు క్యూకట్టే భారతీయుల సంఖ్య వారాల వ్యవధిలోనే దారుణంగా పడిపోయింది. దీంతో గతంలో మాల్దీవుల విదేశీ పర్యాటకంలో మొదటి స్థానంలో ఉండే భారత్ ఇప్పుడు ఏకంగా ఐదో స్థానానికి పడిపోవడం గమనార్హం.మాల్దీవుల పర్యాటక శాఖ విడుదల చేసిన తాజా డేటా ప్రకారం గతేడాది డిసెంబర్ 31 నాటికి 2,09,198 మంది పర్యాటకులతో భారత్ అగ్రస్థానంలో ఉండేది. ఆ ఏడాది మాల్దీవుల్లో భారత్ పర్యాటకుల వాటా దాదాపు 11 శాతం. ఇప్పుడు ఏకంగా ఐదో స్థానానికి పడిపోయింది. 2024 జనవరి 28 నాటికి మాల్దీవులు టూరిజంలో భారత్ వాటా ఏకంగా 8 శాతానికి పతనమైంది. ఈ ఏడు కేవలం 13,989 మంది భారతీయులు మాత్రమే మాల్దీవులను సందర్శించారు. ఈ ఏడాది జనవరి మాసంలో అత్యధిక మంది పర్యాటకులను మాల్దీవులకు పంపిన దేశాల్లో 18,561 మంది పర్యాటకులతో రష్యా తొలి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఇటలీ (18,111), చైనా (16,529) , యూకే (14,588) దేశాలు రష్యా తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

# రైల్వేల రాష్ట్ర స్థాయి భద్రతా కమిటీ పనితీరును సమీక్షించిన డిజిపి రవి గుప్తా




హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);రాష్ట్రంలోని రైల్వే ప్రాంతాల భద్రత పరిస్తితులపై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవి గుప్తా సమీక్షించారు. రాష్ట్ర డిజిపి కార్యాలయంలో రైల్వేస్ ఒ రోడ్ సేఫ్టీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మహేష్ ఎం భగవత్ ఆధ్వర్యంలో రైల్వే పోలీస్, రైల్వే అధికారులతో సమీక్ష సమావేశం సోమవారం నాడు నిర్వహించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్ పి ఎఫ్) ఇన్స్పెక్టర్ జనరల్ మరియు ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమ సింగ్ ఠాకూర్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్, హైదరాబాద్ అనూప్ కుమార్ శుక్ల , సీనియర్ డిఎస్సీ సికింద్రాబాద్ దెబష్మిత సి బెనర్జీ , రైల్వే అడిషనల్ డిఆర్ఎం రాజీవ్ కుమార్ గంగెలే, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ డిఐజి తఫ్సీర్ ఇక్బాల్, ఇంటెలిజెన్స్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ జి దామోదర్ రెడ్డి , రైల్వే ఎస్పీ నలీమ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సమీక్ష సమావేశంలో డిజిపి రవిగుప్త మాట్లాడుతూ..... తెలంగాణ రాష్ట్రంలో రైల్వే పోలీస్ కు అవసరమైన మరి కొంతమంది పోలీస్ సిబ్బందిని కేటాయించే విషయమై చర్చిస్తానని అన్నారు. రైల్వే విభాగంలో ప్రభుత్వ రైల్వే పోలీసులు (జి అర్ పి) 12 రైల్వే పోలీస్ స్టేషన్లోనూ 17 రైల్వే అవుట్ పోస్టులను పని చేస్తున్నారని తెలియజేశారు. రైల్వే పోలీస్ స్టేషన్ల పరిధిలో అవసరమైన కెమెరాలను ఇతర భద్రతాపరమైన సామాగ్రిని పెంచేలా చర్యలు చేపట్టాల్సి ఉందని అన్నారు. హైదరాబాద్ మహానగరం దేశంలోనే అత్యధిక సిసిటీవీ లు కలిగిన రాజధానిగా పేరు ఉందని తదనుగుణంగా రైల్వే స్టేషన్లలోనూ ఏర్పాటు చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. పండుగ రోజులలోను , సెలవు దినాలలోనూ ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్న సందర్భాలలో అదనపు భద్రతపై చర్యలు చేపట్టాలని అన్నారు. రైల్వే ట్రాక్లపై జరుగుతున్న ప్రమాదాలు అన్నింటి పైన రైల్వే పోలీసులు విచారణ జరపాలని సూచించారు ఈ సందర్భంగా రైల్వేస్ అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ.... రైల్వే ట్రాక్లపై ప్రమాదాలు అరికట్టేందుకు అయా ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు , ఫెన్సింగ్ లఏర్పాటు చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. నాంపల్లి, కాజీపేట, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల్లోని రైల్వే పోలీస్ స్టేషన్ల ను రైల్వే స్టేషన్ల లో ఏర్పాటు చేయడం ద్వారా బాధితులు త్వరితగతిన ఫిర్యాదు చేసేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు .లింగంపల్లి ,బేగంపేట్, మేడ్చల్ లలో జి అర్ పి సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాల్సిన ఉందని అన్నారు. సికింద్రాబాద్ రూరల్ రైల్వే పోలీస్ సబ్ డివిజన్, హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఇన్స్పెక్టర్ల కార్యాలయాల పునర్నిర్మాణం కానీ, కొత్త కార్యాలయం ఏర్పాటు కానీ చేయాల్సి ఉందని అన్నారు. మహబూబ్ నగర్ , వికారాబాద్, నల్గొండ , కాజిపేట్, వరంగల్ మంచిర్యాల రైల్వే స్టేషన్లలో సదుపాయాలు ఆధునికరణ జరగాల్సి ఉందని పేర్కొన్నారు .కరీంనగర్లో రైల్వే పోలీస్ స్టేషన్ ని, కోరుట్ల ,సిద్దిపేటలో రైల్వే అవుట్ పోస్టులను ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. లింగంపల్లి, చర్లపల్లి, ఫలక్నామా లలో జి ఆర్ పి సిబ్బందికి సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిందని తెలిపారు డ్రగ్స్ , గంజాయి సికింద్రాబాద్ కాజీపేట లలో స్టీఫర్డ్ డాగ్స్ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. జిఆర్పి సిబ్బంది కోసం రైల్వే ఆసుపత్రిలో ఉచిత వైద్య సదుపాయం కల్పించేటట్టుగా చర్యలు చేపట్టాల్సి ఉందని అన్నారు. సమావేశంలో డిజిపి రవి గుప్తా రైల్వే ప్రయాణికులకు సూచనలు చేస్తూ..... అనుమానాస్పద వ్యక్తులు తారసపడిన వస్తువులు కనిపించిన 100 గాని 139 కు గాని 1512 కు గాని సమాచారం అందించాలని, అపరిచితుల దగ్గర నుంచి తినే పదార్థాలను తీసుకోవద్దని, మహిళలు రాత్రిపూట ప్రయాణించేటప్పుడు ఎక్కువ మంది ప్రయాణికులు ఉన్న కంపార్ట్మెంట్లోనే ఉండాలని అన్నారు. ప్రయాణికులు మొబైల్ ఫోన్లు చేయుట గురైతే సమీప రైల్వే పోలీస్ స్టేషన్లో గాని, లిలిలి.ఇవతితీ.ఐనిల.తిని. కు ఫిర్యాదు చేయాలని అన్నారు. ప్రయాణికుల భద్రత కోసం , ఆర్పిఎఫ్ ,జి ఆర్ పి సిబ్బంది బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు అడిషనల్ డిఆర్ఎం రాజీవ్ కుమార్ గెంగేలె తదితర అధికారులు తమ అభిప్రాయాలను తెలియజేశారు.

# జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ నివాసంలో ఈడీ సోదాలు

**–బీఎండబ్ల్యూ కారుతోపాటు కొన్ని పత్రాలు జప్తు**

**– ఢిల్లీ విమానాశ్రయంలో ఆయన చార్టర్డ్ విమానం పార్క్**

జార్ఖండ్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) మనీలాండరింగ్ ఆరోపణలను ఎదుర్కొంటున్న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్కు (చెందిన బీఎండబ్ల్యూ కారుతోపాటు కొన్ని పత్రాలను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జప్తు చేశారు. ఢిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లిన ఈడీ అధికారులకు ఆయన ఆచూకీ తెలియలేదు. దీంతో ఆయన నివాసంలో అధికారులు సోదాలు నిర్వహించారు. సొరేన్కు ఇప్పటికే ఈడీ ఏడుసార్లు సమన్లు జారీచేయగా.. ఆయన హాజరుకాలేదు. అయితే ముఖ్యమంత్రి కార్యాలయం ఈడీ అధికారులకు పంపిన ఈ–మెయిల్లో, జనవరి 31న మధ్యాహ్నం 1 గంటకు సొరేన్ను రాంచీలోని ఆయన నివాసంలో ప్రశ్నించవచ్చునని తెలిపారు. ప్రభుత్వ భూముల యాజమాన్యం మార్పు కుంభకోణంలో రూ.600 కోట్లు చేతులు మారినట్లు ఈడీ ఆరోపిస్తున్నది. ఇదిలావుండగా, సొరేన్ కోసం ఈడీ అధికారులు సోమవారం జార్ఖండ్ భవన్కు, మోతీలాల్ నెహ్రూ మార్గ్లోని సొరేన్ తండ్రి నివాసానికి వెళ్లారు. కానీ ఆయన ఈ రెండు చోట్ల లేరు. ఆయన చార్టర్డ్ విమానం ఢిల్లీ విమానాశ్రయంలో పార్క్ చేసి ఉంది. కొందరు ఈడీ అధికారులు సోమవారం రాత్రి వరకు ఆయన నివాసం వెలుపల తిష్ఠ వేశారు. అయితే ఇప్పటివరకు ఆయన ఆచూకీ లేకుండా పోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

# నారా భువనేశ్వరికి తృటిలో తప్పిన పెను ప్రమాదం

అమరావతి, జనవరి 30:టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం ఆమె హైదరాబాద్ నుండి గన్నవరానికి ఇండిగో విమానంలో బయలుదేరారు. గన్నవరం ఎయిర్ పోర్టు చేరుకున్న ఈ విమానంలో ల్యాండింగ్ సమయంలో సమస్య తలెత్తింది. సరిగ్గా విమానం ల్యాండింగ్ సమయంలో వీల్ తెరుచుకోలేదు. దీంతో వెంటనే అప్రమత్తమైన పైలెట్ విమానాన్ని మళ్లీ టేకాఫ్ చేయగా.. కొద్దిసేపు అలాగే గాల్లో చక్కర్లు కొట్టింది.

కొద్దిసేపు విమానం గాల్లోనే చక్కర్లు కొట్టడంతో ఏం జరుగుతోందో తెలియక ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. కాసేపటి తర్వాత ల్యాండింగ్ గేర్ తెరుచుకుని వీల్ బయటికి రావడంతో ఇండిగో విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. దాంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నారా భువనేశ్వరికి గన్నవరం ఎయిర్ పోర్టులో మాజీ మంత్రి దేవినేని ఉమా తదితరులు స్వాగతం పలికారు. నారా భువనేశ్వరి ఇవాళ రేపల్లె, పర్చూరు, ఒంగోలు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. చంద్రబాబు స్కిల్ కేసులో అరెస్ట్ అయిన అనంతరం మరణించిన టీడీపీ కార్యకర్తలను కుటుంబాలను పరామర్శించి, వారికి రూ.3 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించనున్నారు.

# న్యూ లైఫ్ చిల్డ్రన్స్ హోమ్కు ప్యూరిఫైయర్ వితరణ




ఖమ్మం, జనవరి 30:(నేటినిజం ప్రతినిధి): సోమవారం గ్రామం న్యూ లైఫ్ చిల్డ్రన్ హోమ్ ఆశ్రమం నందు తోటకూర కోటయ్య జ్ఞాపకర్థం కుమారులు శ్రీనివాస్, రమేష్ కుమార్తె స్వరూప వాటర్ ప్యూరిఫైయర్, పిల్లలకు బ్లాంకెట్స్ అందించి, భోజనాలు ఏర్పాటు చేశారు. వారు పిల్లలతో కొంత సమయం గడిపి వారితో కొన్ని విషయాలను పంచుకున్నారు. పిల్లలు శ్రద్ధగా చదువుకోవాలని మంచి అలవాట్లు అలవర్చుకోవాలని జీవితములో మంచి స్థాయిలో ఉండాలని పెద్దలను ఉపాధ్యాయులను గురువులను గౌరవించాలని కోరారు. చిల్డ్రన్ హోమ్ ఆశ్రమానికి తమ వంతుగా ఎల్లప్పుడూ సహకారము అందిస్తామని తెలిపారు. న్యూ లైఫ్ ఆశ్రమాన్ని నడిపిస్తున్న సుధా లాజరస్ మాట్లాడుతూ...మీ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉండాలని పిల్లల భవిష్యత్తు విషయమై అందరము కలిసి మంచి లైఫ్ ని మంచి ఎడ్యుకేషన్ అందిస్తామని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక సేవ కర్త రామణ అచ్యుత్, సుగుణ, మురళి, వెంకట్, ఉపాధ్యాయులు సాంబ చారి, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న స్వర్ణమ్మ, సుధాకర్ వాలంటీర్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సమాచారం ఇచ్చిన వారికి నగదు రివార్డు

**–జార్ఖండ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ కీలక ప్రకటన**

జార్ఖండ్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):మనీలాండరింగ్ ఆరోపణలను ఎదుర్కొంటున్న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ గత మూడు రోజుల నుంచి కనిపించకుండా పోవడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ మంగళవారం కీలక ప్రకటన చేశారు. సీఎంను కనిపెట్టి సమాచారం ఇచ్చిన వారికి నగదు రివార్డు ప్రకటించారు. రూ.11,000 బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోరెన్ 'మిస్సింగ్' అంటూ పోస్టర్ను ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా షేర్ చేశారు.ప్రభుత్వ భూముల యాజమాన్యం మార్పు కుంభకోణంలో రూ.600 కోట్లు చేతులు మారినట్లు ఈడీ ఆరోపిసున్నది. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని సోరేన్కు ఈడీ అధికారులు ఏడు సార్లు సమన్లు జారీ చేశారు. అయితే ఆయన ఒక్కసారి కూడా విచారణకు హాజరు కాలేదు. ఈ నెల 27న కూడా ఈడీ.. సోరెన్కు సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. జనవరి 29న గానీ, 31న గానీ అందుబాటులో ఉండాలని కోరుతూ స్పందన తెలియజేయాలని పేర్కొంది. అయితే, ఆయన 27వ తేదీన రాత్రి నుంచే అందుబాటులో లేకుండా పోయారు. ఇప్పటి వరకూ సోరెన్ ఆచూకీ తెలియరాలేదు. అతన్ని సంప్రదించేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా అందుబాటులోకి రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆయన ఫోన్ కూడా స్విచ్ఛాఫ్లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, సీఎం సోరెన్ పరారయ్యాడంటూ బీజేపీ ఆరోపిస్తోంది.

# మళ్లీ అధికారమే జగన్ లక్ష్యం

అమరావతి, జనవరి 30: ఏపీలో మళ్లీ అధికారం చేపట్టడమే లక్ష్యంగా అధికార వైసీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందుకు పలు అస్త్రాలతో సిద్ధమవుతోంది. బుధవారం జరిగే (రేపు) మంత్రివర్గ భేటీలో చర్చించి.. పలు అంశాలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. అంతేగాక మంత్రివర్గం తీసుకునే నిర్ణయాలను ఫిబ్రవరి 10వ తేదీన కానీ, 11న కానీ అనంతపురంలో జరిగే సిద్ధం సభలో సీఎం జగన్ ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ప్రతిపక్షాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వైసీపీ ప్రత్యేక వ్యూహాన్ని సిద్ధం చేసిందని విశ్వసనీయ సమాచారం.

**రైతులు, నిరుద్యోగులకు ఇంపార్టెన్స్..**

ప్రధానంగా రైతు రుణమాఫీ, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, ఉద్యోగులకు పీఆర్సీలో భాగంగా ఐఆర్ ప్రకటన అంశాలున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం తదితర వాటిని కూడా పరిశీలించినట్టు సమాచారం.

రైతు రుణమాఫీ విషయంలో ఏ ప్రాతిపదికన చేయాలి అనే చర్చ ఇప్పటికే చేపట్టారు. లక్ష లోపు రుణమా, రెండు లక్షల రుణమా అనేది నిర్ణయించాల్సి ఉందని సమాచారం. వాస్తవానికి రెండు లక్షల లోపు అప్పులున్న రైతులకు రుణమాఫీ చేస్తే ప్రభుత్వంపై ఎంత భారం పడుతుంది.. లక్షలోపు రుణమాఫీ చేస్తే ఎంత భారం పడుతుందనే విషయాలను ఇప్పటికే నిపుణులతో చర్చించి, ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.


**అనంత సభలో బయటపెట్టే అవకాశం..**

అది ఎంతవరకు నిజం అనేది అనంతపురంలో సిద్ధం సభ తర్వాతే తెలుస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలాంటి మరికొన్ని జిల్లాలను తీసుకొని తుది నిర్ణయం వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం. గత ఖరీఫ్ సీజన్లో, అదే విధంగా రబీ సీజన్లోనూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతోపాటు తుపాను కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలోనే రుణమాఫీపై కొండంత ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. వాస్తవానికి మూడు నెలల కిందట శ్రీ సత్య సాయి జిల్లా పర్యటనలో రైతు భరోసా నిధుల పంపిణీకి బటన్ నొక్కే కార్యక్రమానికి వచ్చిన సీఎం.. పుట్టపర్తి సభలోనే ఈ విషయాన్ని ప్రకటిస్తారని అనుకున్నారు. కానీ, త్వరలో అనంతపురంలో జరిగే సిద్ధం సభలో ముఖ్యమంత్రి జగన్ రుణమాఫీపై ప్రకటన చేసి రైతుల పట్ల తన చిత్తశుద్ధిని ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నిత్యం కరువు కాటకాలతో సతమతవయ్యే ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగే సిద్ధం సభలో రుణమాఫీ ప్రకటన వైకాపాకు కలిసి వచ్చే అంశంగా పరిశీలకులు భావిస్తున్నారు.

**పీఆర్సీ పెంపు.. ఐఆర్ ప్రకటన..**

రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో వారిని సంతృప్తి పరిచేందుకు పీఆర్సీ పెంపునకు సంబంధించి ఐఆర్ ప్రకటించి ఉద్యోగులకు సానుకూలంగా ప్రభుత్వం ఉందని చెప్పేందుకు నిర్ణయించినట్లు భావిస్తున్నారు. నిరుద్యోగుల ఆశలకు అవకాశం కల్పించేందుకు ఫిబ్రవరిలోనే మెగా డీఎస్సీ ప్రకటన కూడా విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి ఇటీవలనే మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటన కూడా చేశారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం సదుపాయం హామీతో కాంగ్రెస్ పార్టీ అటు కర్నాటకలోనూ, ఇటు తెలంగాణలో అధికారంలోకి వచ్చింది. దీంతో వైసీపీ సైతం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు గల సాధ్య అసాధ్యాలను అధ్యయనం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఎసిబి కస్టడీకి అవినీతి తిమిగలం ..



హైదరాబాద్, జనవరి 29:హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ కు ఎసిబి కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది.. కస్టడీ పిటిషన్పై నాంపల్లి కోర్టు మంగళవారం విచారణ జరిపింది. 10 రోజుల కస్టడీ కోరుతూ నాంపల్లి కోర్టులో ఏసీబీ పిటిషన్ దాఖలు చేయగా, 8 రోజుల కస్టడీకి కోర్టు అనుమతినిచ్చింది.

ఇక ఈ కేసులో బినామీల విచారణ, ఆస్తులపై దర్యాప్తు చేయాలన్న ఏసీబీ.. ఇప్పటికే పలువురికి నోటీసులు జారీ చేసింది. అధికారులను సైతం ఏసీబీ విచారించనుంది. హెచ్ఎండీఏ, రేరా, మెట్రోలో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఆరా తీయనుంది. హైరేస్ బిల్డింగ్ అనుమతుల్లో అక్రమాలపై విచారణ చేపట్టనుంది. కోర్టులను సైతం తప్పుదోవ పట్టించి వివాదస్పద భూముల్లో అనుమతులు ఇచ్చినట్లు ఏసీబీకి పలు ఫిర్యాదులు అందాయి. దీంతో ఏసీబీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పుప్పాలగూడ 447సర్వే నంబర్లో అనుమతులపై సూర్య ప్రకాష్ అనే వ్యక్తి ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఇప్పటికే రూ.100 కోట్ల విలువైన బాలకృష్ణ అక్రమ ఆస్తులను గుర్తించారు. బాలకృష్ణను కస్టడీకి తీసుకుని విచారిస్తే అక్రమ ఆస్తులు మరింత పెరిగే అవకాశం ఉంది.

# రంజీత్ శ్రీనివాస్ మర్డర్ కేసులో 15 మంది దోషులకు మరణశిక్ష

**– మావెలిక్కర అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సంచలన తీర్పు**

కోయంబత్తూర్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్). కేరళలోని మావెలిక్కర అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. రంజీత్ శ్రీనివాస్ మర్డర్ కేసులో 15 మంది దోషులకు మరణశిక్షను విధించింది. ఇటీవల కాలం కేరళ చరిత్రలో ఒకేసారి ఇంత మంది నిందితులకు ఏ కోర్టు కూడా మరణశిక్షను ఖరారు చేయలేదు. బీజేపీ నేత, లాయర్ రంజీత్ శ్రీనివాస్ను 2021, డిసెంబర్ 19న దారుణంగా హత్య చేశారు. ఆ మర్డర్ కేసు నిందితుల్లో నైసమ్, అజ్మల్, అనూప్, అస్లమ్, అబ్దుల్ కలామ్, సలామ్, సఫారుద్దిన్, మన్సద్, జసీబ్ రాజా, నవాస్, సమీర్, నాజిర్, జాకిర్ హుస్సేన్, షాజీ పూవతుంగల్, షేర్నాస్ అష్రఫ్ ఉన్నారు. ఈ నిందితులు అందరూ నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)లో సభ్యత్వం కలిగి ఉన్నారు.జడ్జి శ్రీదేవి వీజీ ఈ కేసులో తీర్పును వెలువరించారు. నిందితులకు అలపుజా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మెంటల్ స్టెబులిటీ పరీక్షలు నిర్వమించాలని కోర్టు ఆదేశించింది. ఈ మర్డర్ కేసులో తొలి 8 నిందితులపై ఐపీసీలోని 302, 149, 449, 506, 341 సెక్షన్ల కింద కేసు రిజిస్టర్ చేశారు. వీరికి జీవిత కాల శిక్షతో పాటు మరణదండన విధించారు. అయితే తొలి 8 మంది ప్రత్యక్షంగా మర్డర్లో పాలు పంచుకున్నారు. హత్యకు గురైన బీజేపీ నేత ఇంటి ముందు ఆయుధాలతో నిఘా పెట్టిన 9 నుంచి 12వ నిందితుడి వరకు వివిధ సెక్షన్ల కింద కేసులను బుక్ చేశారు. ప్రధాన నిందితుల జాబితాలో జకీర్, షాజీ, షెర్నాస్పై ఐపీసీలోని 120బీ, 302 కింద కేసు బుక్ చేశారు.

# కారు, బైకు ఢీ.. ఇద్దరి దుర్మరణం

మహబూబ్నగర్, జనవరి 30: కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండల పరిధిలోని కాచ్ వార్ వద్ద 167వ జాతీయ రహదారిపై ఇవాళ మధ్యాహ్నం చోటుచేసుకుంది.

స్థానికుల కథనం మేరకు హైదరాబాద్ వైపు నుండి రాయిచూర్ వైపు బీఎండబ్ల్యూ కారు వెళ్తుండగా కాచ్ వార్ వద్ద పొలాల వైపు నుండి రోడ్డుపైకి ఇద్దరు యువకులు బైక్ పై రావడంతో కారు బైకు ఢీకొన్నాయి .

ఈ సంఘటనలో బైక్ పై వెళుతున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.

మృతులిద్దరూ కూడా మక్తల్ మండల కేంద్రంలోని భరత్ నగర్ కు చెందిన వారుగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# శివసేన పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ ఘన నివాళి



హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); మహాత్మా గాంధీ 76 వ వర్ధంతి సందర్భంగా సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ దగ్గర శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధనా కార్యదర్శి ఏ సుదర్శన్ నేతృత్వం లో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. దేశ స్వతంత్రం కోసం చేసిన ఆయన పోరాటం వళ్ళ ఆయన జాతిపితగా గుర్తింపు పొందాడని సుదర్శన్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం లో శివసేన తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌట్ గణేష్ ,ఆనంద్. శివ శిల్ప నాగేశ్వర్ తిరుమలు యాదగిరి రజుకుమర్ చంద్ పాషా గోపాల్ సునీల్ ,తదితరులు పాల్గొన్నారు.

# అధికారిక రహస్యాలను బయటపెట్టిన కేసులో ఇమ్రాన్‌కు పదేళ్ల జైలు శిక్ష

న్యూ ఢిల్లీ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీక్ ఈ ఇన్సాఫ్ చీఫ్ ఇమ్రాన్ ఖాన్ కు భారీ షాక్ తగిలింది. అధికారిక రహస్యాలను బయటపెట్టిన కేసులో పాకిస్థాన్ కోర్టు ఇమ్రాన్‌కు పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఇమ్రాన్‌తోపాటు మాజీ విదేశాంగ మంత్రి, పీటీఐ వైస్ చైర్మన్ షా మహమూద్ ఖురేషీ కి కూడా 10 ఏళ్లు శిక్ష విధిస్తూ స్పెషల్ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. 2022లో ప్రధాన మంత్రి పదవి నుంచి దిగిపోయే ముందు ఇమ్రాన్ ఖాన్ బహిరంగ ర్యాలీలో మాట్లాడారు. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు అగ్రరాజ్యం అమెరికా కుట్రపన్నిందని ఆరోపించారు. అమెరికా ఆదేశాలకు అనుగుణంగా పాకిస్థాన్ మిలిటరీ ప్రభుత్వం నడుచుకుంటోందని ఆరోపణలు గుప్పించారు. ఇందుకు ఆధారాలుగా కొన్ని పత్రాలను ఆ ర్యాలీలో ప్రదర్శించారు. అమెరికాలోని పాకిస్థాన్ ఎంబసీ నుంచి వాటిని సేకరించినట్లు తెలిపారు. దీంతో అధికారిక దౌత్య సమాచారానికి సంబంధించిన వివరాలను బహిర్గతం చేయడం ద్వారా దేశ రహస్య చట్టాలను ఉల్లంఘించారని ఇమ్రాన్ ఖాన్, ఖురేషీలపై పాకిస్థాన్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన స్పెషల్ కోర్టు.. ఇద్దరినీ దోషులుగా తేల్చింది. ఈ మేరకు ఇరువురికీ పదేళ్లు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

# రాంచీలో ఎమ్మెల్యేల సమావేశంలో ప్రత్యక్షమయిన హేమంత్ సోరెన్

## -ఏ క్షణమైనా ఈడీ అధికారులు అరెస్ట్ చేసే అవకాశాలు

## -రాష్ట్ర నాయకత్వ మార్పు తప్పదనే ఊహాగానాలు

## -సోరెన్ భార్య కల్పనా సోరెన్ కు సీఎం బాధ్యతలు అప్పజెప్పనున్నట్లు టాక్

## -సోరెన్ నివాసంతోపాటు రాజ్‌భవన్, ఈడీ కార్యాలయం వద్ద 144 సెక్షన్

జార్ఖండ్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);మనీలాండరింగ్ ఆరోపణలను ఎదుర్కొంటున్న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ ఎట్టకేలకు కనిపించారు. రాంచీలో ఎమ్మెల్యేల సమావేశంలో ప్రత్యక్షమయ్యారు. అయితే, మనీ లాండరింగ్ కేసులో హేమంత్ సొరేన్ కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తీవ్రంగా గాలిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు సోరెన్ రాంచీలో ఉన్నట్లు వెల్లడికావడంతో ఆయన్ని ఈడీ అధికారులు ఏ క్షణమైనా అరెస్ట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓవైపు ఈడీ విచారణ, మరోవైపు సీఎం అందుబాటులో లేకపోవడంతో ఝార్ఖండ్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రాష్ట్ర నాయకత్వ మార్పు తప్పదనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ కు సీఎం బాధ్యతలు అప్పజెప్పనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో హేమంత్ సోరెన్ అధ్యక్షతన రాంచీలో ఝార్ఖండ్ ముక్తి మోర్చా నాయకులు, పార్టీ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. హేమంత్ సోరెన్ భార్య కల్పన కూడా ఈ సమావేశంలో పాల్గొనడం నాయకత్వ మార్పు తప్పదనే ఊహాగానాలకు బలం చేకూరుతోంది. ఒకవేళ హేమంత్ సోరెన్ అరెస్టై జైలుకు వెళితే ఆయన భార్యకు ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించే విషయంపై సమావేశంలో చర్చిస్తున్నట్టు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కల్పనా సోరెన్‌ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చొబెట్టానికి పావులు కదుపులోందని, అందుకే అధికార కూటమిలోని ఎమ్మెల్యేలను రాంచీలో ఉండాలని కోరిందని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ సాయంత్రం 4:30 గంటలకు సోరెన్ పార్టీ మీడియా ముందుకు రానుంది. ఆ సమావేశంలో ఊహాగానాలకు తెపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు తాజా పరిస్థితుల నేపథ్యంలో సీఎం హేమంత్ సోరెన్ నివాసంతోపాటు రాజ్‌భవన్, ఈడీ కార్యాలయం వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు.

# ఉడుత ఊపులకు.. కుక్క అరుపులకు గులాబీ శ్రేణులు దడవవు : జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 29:ఉడుత ఊపులకు, కుక్క అరుపులకు గులాబీ శ్రేణులు దడవవని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. వెూదీ సర్కార్ నిర్ణయాలు తీసుకున్న ఫలితంగానే ఓడిపోయామన్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిశీలన జరుపకుండానే ఢిల్లీలో కూర్చుని కాళేశ్వరం మీద ఎన్నికలకు రెండురోజుల ముందట విడుదల చేసిన నివేదికనే ఇందుకు తార్కాణమన్నారు.

అప్పటికీ, ఇప్పటికీ తెలంగాణ ప్రజలు గులాబీ బాస్ కేసీఆర్ వెంటే ఉన్నారని తేల్చిచెప్పారు. కేసులకు, దాడులకు గులాబీ శ్రేణులు భయపడరని స్పష్టం చేశారు.

అధికార పార్టీ అరాచకాలపై గులాబీ దండు తిరగబడితే పాలక కాంగ్రెస్ పక్షం పత్తా దొరకదంటూ హెచ్చరించారు. అదే జరిగితే కాంగ్రెస్ పాలకులు ఢిల్లీలో తల దాచుకోవాల్సిన దుస్థితి ఎదురవుతుందన్నారు. దాడులతో రెచ్చిపోతే ఉపేక్షించేది లేదన్నారు. మొన్న సూర్యాపేట, నిన్న భోనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి ఉదంతాలను ఆయన వివరించారు. అధికారం ఉంది కదా అని అహంకారంతో ప్రవర్తిస్తే తెలంగాణ సమాజం ఉపేక్షించబోదన్నారు. నిజాం నవాబులను తరిమిన గడ్డ ఇదని అంతకంటే కాంగ్రెస్ పాలకులు ఎక్కువ కాదన్నారు. కొందరు రండలు కేసులు పెడతావంటూ బెదిరింపులకు దిగుతున్నారని ఈ ఉడుత ఊపులకు, కుక్క అరుపులకు గులాబీ శ్రేణులు దడవాన్నారు. మీరు ఆంధ్రాబాస్ వద్ద మొకరిల్లిన రోజునే మెడలు వంచి తెలంగాణ సాధించిన నేత కేసీఆర్ లాంటి నేత సారథ్యంలో పని చేసిన గులాబీ దండును ఎవరూ ఏమీ చెయ్యలేరన్నారు. ఆ మాటకు వస్తే తెలంగాణ మాదని ఎంత మాత్రం మీది కాదన్నారు. కేసీఆర్ సాధించిన రాష్ట్రంలో ముఖ్యమంత్రి, మంత్రి పదవులతో పాటు టీపీసీసీ, టీ బీజేపీ ఇతర పార్టీలకు సారథ్యం వహిస్తున్నారన్నారు. అది కేసీఆర్ భిక్ష మాత్రమేనని స్పష్టం చేశారు. పైసలున్నా కాంగ్రెస్ పాలకులకు పాలన చేత కాదని దుయ్యబట్టారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎదిగిన వారికి మాత్రమే పాలనానుభవం ఉంటుందన్నారు. చంద్రబాబు చెప్పులు మోసిన వారికి, వైఎస్సార్ బూట్లు నాకినోళ్లకు పాలనా అనుభవం ఎక్కడిదన్నారు. అప్పులు చెయ్యమన్నదే కాంగ్రెస్ పార్టీ నేతలని.. ఆ అప్పు మాఫీ చేయాలని అడిగితే చెప్పులతో కొట్టండి, కాలర్ పట్టి నెట్టండి అంటూ స్వయంగా మంత్రులు మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో పాలనానుభవం ఏ పాటిదో అన్నది ఇట్టే తేలిపోతుందన్నారు. ఇదేనా తెలంగాణా సమాజం కోరుకున్న మార్పు అంటూ కాంగ్రెస్ పాలకులపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు.

# స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు వంట అయినంక గరిటె తిప్పినట్లు ఉంది

## -మాజీ మంత్రి హరీశ్‌రావు సెటైర్లు

హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు అందించే కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమం 'వంట అయినంక గరిటె తిప్పినట్లు' ఉందంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు సెటైర్లు వేశారు. ఉద్యోగ భర్తీ ప్రక్రియను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేస్తే.. తమ ప్రభుత్వ ఘనతగా నియామక పత్రాల జారీ పేరుతో కాంగ్రెస్ సర్కారు హడావుడి చేస్తుండడం దౌర్భాగ్యమన్నారు. ఫిబ్రవరి ఒకటిన గ్రూప్-1 నోటిఫికేషన్ ఇస్తామని కాంగ్రెస్ ప్రచారం చేసిందని.. దాని నుంచి విద్యార్థుల దృష్టి మరల్చేందుకు ముందు రోజున స్టాఫ్ నర్సులకు నియామక పత్రాల జారీ కార్యక్రమాన్ని హంగు ఆర్భాటంతో నిర్వహిస్తుందన్నారు. చేయని పనులకు డబ్బా కొట్టుకోవడం బదులు.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలుపై శ్రద్ధ చూపాలని హరీశ్‌రావు హితవు పలికారు.

### బీఆర్ఎస్ ప్రభుత్వం ఘనతే..

తెలంగాణ వైద్యారోగ్య రంగాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి చేర్చే లక్ష్యంలో భాగంగా పెద్ద సంఖ్యలో ఆసుపత్రుల నిర్మాణంతో పాటు జిల్లాకో మెడికల్ కాలేజీ బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ క్రమంలో వైద్య సిబ్బంది కొరత లేకుండా ఉండేందుకు మెడికల్, నర్సింగ్, పారామెడికల్, ఫార్మాసిస్టు, ఇతర సిబ్బంది రిక్రూట్మెంట్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 5,204 స్టాఫ్ నర్స్‌పోస్టులకు 2022 డిసెంబర్ 30న నోటిఫికేషన్ విడుదల చేయగా.. 2023 జూన్ 22న 1,890 పోస్టులను కలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

దీంతో మొత్తం పోస్టుల సంఖ్య 7,094కు పెరిగిందని తెలిపారు. 2023 ఆగస్టు 2న ఉద్యోగాలకు పరీక్ష నిర్వహించి, తుది ఫలితాలు విడుదల చేసే సమయానికి ఎన్నికల కోడ్ మొదలైందన్నారు. దాంతో తుది ఫలితాల విడుదలకు తాత్కాలిక ఆటంకం కలిగిందని గుర్తు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహిస్తూ, నియామక పత్రాలు ఇచ్చే పేరిట హడావుడి చేస్తూ స్టాఫ్ నర్సు నోటిఫికేషన్ తమ ప్రభుత్వ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు.

### ఉద్యోగ నోటిఫికేషన్లు ఏమయ్యాయి

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది 2లక్షల పోస్టులను భర్తీ చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. మొదటి కేబినెట్ సమావేశంలోనే ఆమోదించి, అభ్యర్థులకు ఎలాంటి అప్లికేషన్ ఫీజు లేకుండా, ఏడాదిలోపే అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తామని, అలాగే గతంలో ప్రారంభించిన నియామకాల ప్రక్రియను వాటి షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామని కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ పేరిట పత్రికల్లో ప్రకటనలు విడుదల చేసిందని గుర్తు చేశారు. చెప్పినట్లుగా ఫిబ్రవరి ఒకటో తేదీన గ్రూప్-1 నోటిఫికేషన్, అలాగే ఏప్రిల్ 1న గ్రూప్-2, జూన్ 1న గ్రూప్-3,4 నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 1న పోలీసు సహా తరహా యూనిఫాం పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ఎదురుచూస్తున్న ఉద్యోగ అభ్యర్థులకు, విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.

### నర్సింగ్ ఆఫీసర్లకు శుభాకాంక్షలు..

స్టాఫ్ నర్సులుగా ఎంపికై బుధవారం నియామక పత్రాలు అందుకోబోతున్న అభ్యర్థులకు హరీశ్ రావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల మన్ననలు పొందేలా అత్యుత్తమ సేవలందించి, ఉద్యోగంలో రాణించాలని ఆకాంక్షించారు.

మొత్తం 7,094 స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేసే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు (ఓఊఖీః)ని అభినందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సుల సేవలను గుర్తించి, వారి గౌరవాన్ని మరింత పెంచేలా వృత్తి పేరును ఉన్నతీకరించిందని హరీశ్‌రావు అన్నారు.

స్టాఫ్ నర్సుని నర్సింగ్ ఆఫీసర్‌గా, హెడ్ నర్సుని సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా, హెడ్ నర్సుని సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2ను డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1ను చీఫ్ నర్సింగ్ ఆఫీసర్‌గా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు. నర్సు పోస్టుల పేరును మా ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో విడుదల చేసి ఉన్నతీకరించినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా స్టాఫ్ నర్సులుగా పరిగణించడం శోచనీయమని హరీశ్‌రావు అన్నారు.

# ఏపీ వైద్య ఆరోగ్య శాఖలో 424 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అమరావతి జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ );ఏపీ వైద్య ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలయ్యింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని మెడికల్ కాలేజీల్లోని 424 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, లేటరల్ ఎంట్రీ ద్వారా భర్తీ చేయనున్నారు.

సూపర్ స్పెషాలిటీలో 169, బ్రాడ్ స్పెషాలిటీలో 255 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామని మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. వీటిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల పరిధిలోని మెడికల్ కాలేజీల్లోని 169 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 6వ తేదీన విజయవాడలోని డీఎంఈ కార్యాల యంలో వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల లోపు వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. బ్రాడ్ స్పెషాలిటీల్లోని 255 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎం.శ్రీనివాసరావు సూచించారు. పూర్తి వివరాలకు https:// dme.ap.nic.in/ , http:// apmsrb.ap.gov.in/msrb/ వెబ్‌సైట్లను సంప్రదించాలని అన్నారు.

# పశువుల వైద్యశాలను ప్రారంభించిన పరికపల్లి



ఖమ్మం, జనవరి 30:(నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం పెద్దమునగాల గ్రామంలో పశువుల వైద్యశాలను ప్రారంభించిన కాంగ్రెస్ నేత గ్రామ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో పశువులకు ఏ అనారోగ్య సమస్యలు వున్న వైద్యులు అందుబాటులో వుంటారని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోగలరని అలాగే పశువుల పెంపకాన్ని మరింత అభివృద్ధి చెంది లాభదాయకాన్ని అర్జించాలని, పాడి పరిశ్రమను మరింతగా పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొనిజర్ల పశువుల వైద్యులు బి.శ్రీనివాస్ నా యక్, సూపర్వైజర్ టిఎల్ చారి, పెద్దమునగాల గోపాల మిత్రలు వు, శ్రీను, చిన్న నరసింహా రావు, ఎం.రమేష్, ఎన్.సుధాకర్, అప్పారా రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. వికారాబాద్ స్టేషన్‌లో నాలుగు రైళ్లకు స్టాప్..!

హైదరాబాద్, జనవరి 30:వికారాబాద్ వాసులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. నాలుగు రైళ్లను తాతాల్కికంగా నిలుపలున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

ముంబయి సీఎస్‌టీఎం-భువనేశ్వర్ (11019) రైలు ఉదయం 2.9గంటలకు వచ్చి.. 2.10గంటలకు బయలుదేరనున్నాయి. ఈ రైలు ఈ నెల 30, 31న, ఫిబ్రవరి 10, 11, 12 తేదీల్లో ఆగుతుందని చెప్పింది. రాజ్‌కోట్-సికింద్రాబాద్ (22717) రైలు ఉదయం 5.9 గంటలకు బయలుదేరి.. 5.10 గంటలకు బయలుదేరి వెళ్తుంది.

ఈ రైలు ఈ నెల 30, 31న, ఫిబ్రవరి 10, 11, 12 తేదీల్లో ఆగుతుందని వివరించింది. భువనేశ్వర్-సీఎస్‌టీఎం (11020) రైలు మధ్యాహ్నం 12.14 గంటలకు వచ్చి.. మళ్లీ 12.15 గంటలకు బయలేరి వెళ్తుంది.

ఈ రైలు ఫిబ్రవరి 2, 3, 14, 15 తేదీల్లో ఆగబోతున్నది. సికింద్రాబాద్ - రాజ్‌కోట్ (22718) రైలు మధ్యాహ్నం 3.59 గంటలకు చేరుకొని.. 4 గంటలకు బయలుదేరి వెళ్తుందని, 3, 4, 15, 16 తేదీల్లో తాత్కాలికంగా వికారాబాద్ స్టేషన్‌లో ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే పీఆర్వో రాకేశ్ వివరించారు.

# టిబి పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

## -లీడ్ సంస్థ సిపిఎల్ మిథిలేష్ శర్మ పిలుపు

## -కంటోన్మెంట్ లోని మద్ఫర్డ్ హట్స్ స్లం లో అవగాహన ర్యాలి



సికింద్రాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);టిబి పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని లీడ్ సంస్థ సిపిఎల్ మిథిలేష్ శర్మ పిలుపునిచ్చారు. లీడ్ స్వచంద సంస్థ అధ్వర్యంలో లో టిబి అవగాహన ర్యాలీ కంటోన్మెంట్ లోని మద్ఫర్డ్ హట్స్ స్లం లో నిర్వహించ్జరు. ఈ సందర్భంగా మిథిలేష్ శర్మ మాట్లాడుతూ వారం కంటే ఎక్కువ దగ్గు జ్వరం బరువు తగ్గడనీ ఉంటే వెంటనే దగ్గర లోని ప్రభుత్వ హాస్పిటల్ లో పరీక్షలు చేపించుకొని క్రమం తప్పకుండా ఆరు నెలలు మందులు వాడాలని తెలిపారు. అలాగే ఇతరులకు సోకకుండా మాస్క్ ధరించాలన్నారు. మందులు వాడుతున్న సమయం లో పోషక ఆహారం తో పాటు ప్రతి ఒక్కరికి ప్రతి నెల 500 రు ప్రభుత్వం నుండి అందజేస్తారు అని తెలిపారు ఈ కార్యక్రమంలో లీడ్ సంస్థ ప్రతినిధులు సతీష్,శ్యామల, మంజులత, శారద, స్లం పెద్దలు స్లం సభ్యులు పాల్గొన్నారు

# తిరుమలలో సనాతన ధార్మిక సదస్సుకు ముమ్మరంగా ఏర్పాట్లు : టీటీడీ ఈవో



తిరుపతి, జనవరి 30: తిరుమల ఆస్థాన మండపంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సనాతన ధార్మిక సదస్సు కు ముమ్మరంగా ఏర్పాట్లు చేయాలని ఈవో ఎవి.ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనం సమావేశ మందిరంలో అధికారులతో ధార్మిక సదస్సుపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమల ఆస్థాన మండపంలో మూడు రోజుల పాటు జరగనున్న సనాతన ధార్మిక సదస్సులో దేశంలోని ప్రముఖ మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామిజీలు పాల్గొంటారన్నారు. సదస్సుకు వచ్చే స్వామీజీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ముగ్గురు సీనియర్ అధికారులతో కూడిన సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి, వివిధ మఠాధిపతులు, పీఠాధిపతులను సంప్రదించాలన్నారు. సదస్సులో ప్రతి స్వామిజీకి ఒక లైజన్ అధికారిని నియమించి దర్శనం, వసతి, ఆహార, రవాణా తదితర కమిటీలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

# ఢిల్లీకి జగన్ .. అమిత్ షాతో ప్రత్యేక భేటీ

అమరావతి, జనవరి 30:ఏపీ సీఎం జగన్ ఢిల్లీ పర్యటనకు వెళున్నారు. అయితే, ఇది అధికారిక పర్యటన కాదని, పూర్తి స్థాయిలో రాజకీయ పర్యటన అని తెలుస్తోంది. రేపు లేదా ఎల్లుండి ఆయన ఢిల్లీకి వెళ్లనున్నట్టు సమాచారం. తన పర్యటనలో ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు. రానున్న ఎన్నికల్లో ఇరు పార్టీల మధ్య సహకారంపై చర్చించనున్నట్టు తెలుస్తోంది. వైసీపీకి సహకరిస్తే ఒక రాజ్యసభ సీటును బీజేపీకి ఇచ్చేందుకు జగన్ సిద్ధంగా ఉన్నట్టు సమాచారం అందుతోంది. మరోవైపు ఏపీ రాజకీయాలు హీటెక్కిన నేపథ్యంలో ఈ భేటీపై పలు ఊహాగానాలు వెలు వడుతున్నాయి. ఇక.. కాంగ్రెస్ ఏపీ చీఫ్ షర్మిల రాకతో రాజకీయాలు మరింత రంజుగా మారాయి. షర్మిల నేరుగా తననే టార్గెట్ చేస్తుండటం జగన్ కు ఇబ్బందికరంగా మారిందని, ఈ నేపథ్య ఓంలో బీజేపీ పెద్దలను కలిసేందుకు ఢిల్లీకి వెళ్తున్నారని సమాచారం.

# పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను సత్కరించిన మెగాస్టార్ చిరంజీవి

హైదరాబాద్, జనవరి 30: పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి సత్కరించారు. జనగామ జిల్లా దేవరుప్పల మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. ఈ క్రమంలో గడ్డం సమ్మయ్యను తన నివాసానికి ఆహ్వానించిన చిరంజీవి ఆయన్ను సన్మానించారు. అలాగే చిరంజీవికి పద్మవిభూషణ్ వచ్చిన సందర్భంగా ఆయన్ను సమ్మయ్య సత్కరించారు.

అనంతరం చిరంజీవి మాట్లాడుతూ.. అంతరించిపోతున్న చిందు యక్షగాన కళారూపానికి జీవం పోస్తున్న కళాకారుడికి పద్మశ్రీ రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఇలాంటి కళారూపాలను గుర్తించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. కళలను, కళాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడుకోవాలని కోరారు. కాగా, చిరంజీవి లాంటి గొప్ప వ్యక్తి తనను ఇంటికి ఆహ్వానించి, సత్కరించడం తన జీవితంలో మరిచిపోలేని అనుభూతి అని గడ్డం సమ్మయ్య తెలిపారు.

# మేడమ్ టుస్సాడ్స్‌లో బాబా రాందేవ్ మైనపు బొమ్మ.. గర్వంగా ఉందన్న యోగా గురువు..!

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ మైనపు బొమ్మను న్యూయార్క్‌లోని మేడమ్ టుస్సాడ్స్‌లో ఆవిష్కరించారు. ఇప్పటికే భారత్‌కు చెందిన ప్రముఖుల మైనపు బొమ్మలు సైతం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, మన్మోహన్‌సింగ్, ప్రధాని నరేంద్ర మోదీ, క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్, నటులు సల్మాన్ ఖాన్, మహేశ్ బాబు, ప్రభాస్‌తో పాటు మరికొందరి మైనపు బొమ్మలున్నాయి. తాజాగా యోగా గురు బాబా రాందేవ్‌కు సైతం గౌరవం దక్కింది.

వృక్షాసన ముద్రలో రామ్‌దేవ్ మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాందేవ్ బాబా యోగాతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. భారతీయ యోగా, పురాతన ఆయుర్వేద చికిత్సల ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని ప్రోత్సహిస్తూ వస్తున్నారు. అన్ని వయసుల వ్యక్తులను ఆయన ప్రభావితం చేశారు. యోగాతో పాటు ఆయుర్వేదం, వ్యాపారంలో సైతం రాణిస్తున్నారు. మేడమ్ టుస్సాడ్స్ న్యూయార్క్ తరపున ప్రతినిధి టియాగో మొగోడారో మాట్లాడుతూ బాబా రామ్‌దేవ్ మైనపు బొమ్మను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు.

యోగాను ప్రోత్సహించడం, ఆయుర్వేద సంస్కృతిని పరిచయం చేయడం, ఆరోగ్యకరమైన జీవన విధానం కోసం పాటుపడుతున్నారన్నారు. యోగాకు చేసిన సేవలకు ఆయనను గౌరవించినందుకు గర్వపడుతున్నామన్నారు. బాబా రాందేవ్ మాట్లాడుతూ మైనపు బొమ్మను ఆవిష్కరించడం తనకు లభించిన గొప్ప గౌరవమన్నారు. భారతీయ సంస్కృతి, ముఖ్యంగా యోగా, ఆయుర్వేదం ప్రపంచ ప్రభావానికి ఇది ఒక ముఖ్యమైన గుర్తింపుగా తాను భావిస్తున్నానన్నారు.

# కరాటే పోటీల్లో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ




రాజన్న సిరిసిల్ల, జనవరి 30:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు మంచిర్యాల్ లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ సుదీష్ కుమారి మంగళవారం తెలిపారు. కటాస్, కుమిటి విభాగంలో సిహెచ్ సూర్య జయచంద్ర, బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను శ్రీ చైతన్య సంస్థల ఏజీఎం ముద్రకోల రాజు, ప్రిన్సిపాల్ సుదీష్ కుమారి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ శేఖర్ ఏఓ సుదీర్, డీన్ శేఖర్, ప్రైమరీ ఇన్చార్జిలో రజిత, ప్రవళిక పిఈటి సుధాకర్, మారుతి, ఉపాధ్యాయుల బృందం ఉన్నారు.

# గాంధీజీ సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, జనవరి 30:శాంతి, అహింసలనే ఆయుధాలుగా చేసుకొని దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయుడు గాంధీజీఅని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన సికింద్రాబాద్‌లోని ఎంజీ రోడ్ లో గల గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి గాంధీజీ చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు. శాంతి, సామరస్యంతో దేనినైనా సాధించ వచ్చని ఆచరణలో చూపించారన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు అత్తిలి అరుణ గౌడ్, నామన శేషుకుమారి, కిరణ్మయి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్ గౌడ్, నాయకులు టి.శ్రీహరి, శేఖర్, సంతోష్, కిశోర్, లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్, ఆంజనేయులు, మహేష్, అబ్బాస్, వాసు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పించే కోర్సులపై దృష్టి పెట్టండి: ప్రొఫెసర్ లింబాద్రి

## -బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో రెండు రోజుల సదస్సు
## -ప్రారంభించిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి




హైదరాబాద్, జనవరి 30:నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో యూనివర్సిటీలు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. ఓపెన్ యూనివర్సిటీ, సామాజిక శాస్త్ర విభాగం, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఐసీఎస్ఎస్ఆర్ సౌత్ రీజియన్ ఆధ్వర్యంలో సోమవారం జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 'భారత దేశంలో ఉన్నత విద్య నాణ్యత సవాళ్లు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలోని ఉన్నత విద్యను అభ్యసించే వారి సంఖ్యలో గణనీయ అభివృద్ధి ఉందని, ఇప్పటికే దేశంలో ఉన్న విద్యనభ్యసిస్తున్న వారి సంఖ్య 28.4 శాతంగా ఉందన్నారు. తెలంగాణలో ఇది 40 శాతం నమోదు కావడం శుభపరిణామవన్నారు. అలాగే, జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణలో ఉన్నత విద్యను అభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, వర్గాల నమోదు శాతం బాగా పెరిగిందన్నారు.

ఉన్నత విద్యను అభ్యసించే మహిళల సంఖ్య కూడా బాగా పెరిగిందన్నారు. ఉన్నత విద్యాభివృద్ధిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పాత్ర చాలా కీలకమన్నారు. అయితే డిగ్రీతో పోల్చితే పీజీలో ప్రవేశాలు పొందుతున్న వారి సంఖ్య 15 శాతం దాటడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓపెన్ యూనివర్సిటీ మాజీ వీసీ, న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, దూర విద్యలో విస్తృత ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ప్రైవేటీకరణ, మార్కెటీకరణ, సమాజంలో అసమానతలు, పాలకుల్లో చిత్తశుద్ధి లేమి, పక్షపాత ధోరణి వంటివి విద్యా వ్యవస్థలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయన్నారు. కార్యక్రమంలో ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సీతారామారావు, అడకమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీఆర్ఎన్‌రెడ్డితో పాటు యూనివర్సిటీకి చెందిన పలువురు సీనియర్ ప్రొఫెసర్లు, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో విషాదం.. వరకట్న వేధింపులకు వివాహిత బలి

హైదరాబాద్, జనవరి 30:వరకట్న వేధింపులకు ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. మంగళవారం చేవెళ్ల ఎస్ఐ బ్రహ్మం తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా రాకంచెర్ల గ్రామానికి చెందిన లలిత కుమార్తె జ్యోతి (23)ని చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామానికి చంద్రయ్య కుమారుడు రాజు (30)కి ఇచ్చి 18 నెలల క్రితం వివాహనం చేశారని తెలిపారు.

వివాహనం అయినపుటి నుంచి రాజు జ్యోతిని అదనంగా వరకట్నం తీసుకురావాలని వేధింపులకు గురిచేశానడని, వివాహ సమయంలోనే రాజుకు 6 తులాల బంగారం, ద్విచక్ర వాహనం, రూ.5 లక్షల నగదును ఇచ్చామని బాధితులు తెలిపారని చెప్పారు. పెళ్లయిన అనంతరం జ్యోతి రాజు వద్ద కేవలం 4 నెలలే ఉన్నదని మిగతా రోజులు తల్లి లలిత వద్దనే ఉందన్నారు.

గత మూడు రోజుల క్రితం రాజు తండ్రి చంద్రయ్య, ఇద్దరు పెద్దమనుషుల సమక్షంలో జ్యోతి ఉంటున్న తల్లిగారి ఇంటికి వెళ్లి నచ్చజెప్పి ఆలూర్ గ్రామానికి తీసుకువచ్చారు.

# బస్సు రన్నింగ్‌లో ఉండగా డ్రైవర్‌కు గుండెపోటు.. 65 మందిని కాపాడి హఠాన్మరణం..!

భువనేశ్వర్, జనవరి 30: ఒడిశాలో విషాద ఘటన చోటుచేసుకుంది. బస్సు రన్నింగ్‌లో ఉండగా డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింది. అప్పుడు గనుక డ్రైవర్ స్టీరింగ్ విడిచిపెడితే ఆ బస్సులోని 65 మంది ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోయేవి. కానీ ఆ డ్రైవర్ అలా చేయలేదు. బస్సును పక్కకు ఆపేసి ప్రాణాలు విడిచాడు. బస్సులోని 65 మంది ప్రాణాలు కాపాడాడు. ఒడిశా రాష్ట్రం బాలాసోర్ జిల్లాలోని పటాపూర్ చక్‌లో మంగళవారం ఉదయం ఈ ఘటన జరిగింది.

పోలీసుల వెల్లడించిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన పర్యాటకులు ఓ బస్సులో బాలాసోర్‌లోని పంచ లింగేశ్వరాలయం వైపు వెళ్తున్నారు. మరికాసేపట్లో ఆలయానికి చేరుకుంటామనగా డ్రైవర్‌కు గుండపోటు వచ్చింది. దాంతో బస్సును పక్కకు ఆపి స్పృహ కోల్పోయాడు.

బస్సులోని ప్రయాణికులు అతడిని హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించడా అప్పటికే అతను ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతిచెందిన డ్రైవర్‌ను షేక్ అక్తర్‌గా గుర్తించారు. గుండెపోటు వచ్చినా అప్రమత్తంగా వ్యవహరించి డ్రైవర్ తమ ప్రాణాలు కాపాడాడని ఆ బస్సులోని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

# కనకదుర్గమ్మకు కానుకల వర్షం..



అమరావతి, జనవరి 30:ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత ప్రసిద్ధి చెందిన రెండో దేవాలయమైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కొలువైయున్న కనకదుర్గమ్మకు భక్తులు కానుకల వర్షాన్ని కురిపించారు. గడిచిన 20 రోజుల ఆలయ హుండీలను అధికారులు లెక్కించగా అందులో నగదు రూపంలో మూడు కోట్లు 700 గ్రాముల బంగారం ఆరు కేజీల వెండితో పాటు పెద్ద ఎత్తున విదేశీ డాలర్లు కానుకల రూపంలో వచ్చాయి.

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న మహా మండపం ఆరవ అంతస్తులు మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు ఈవో కేఎస్ రామారావు ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లెక్కింపులో 20 రోజులకు నగదు రూ. 2,99,68,935/- వచ్చింది. కానుకల రూపములో బంగారం 648 గ్రాములు, వెండి 5 కేజీల 610 గ్రాములు, భక్తులు హుండీ ద్వారా అమ్మవారికి సమర్పించుకున్నారు.

విదేశీ కరెన్సీలో యూఎస్ఏ 542 డాలర్లు, ఓమన్ 1.5 రియాల్స్, ఇంగ్లాండ్ 20 పౌండ్లు, కెనెడా 100 డాలర్లు, ఆస్ట్రేలియా 20 డాలర్లు, యూరో 20 యూరోలు, సింగపూర్ 35 డాలర్లు, మలేషియా 1 రింగెట్, యూఏఈ 105 దిర్హమ్స్, కువైట్ 0.5 దినార్, హాంకాంగ్ డాలర్లు, సౌదీ 11 రియాల్స్, న్యూజిలాండ్ 20 డాలర్లు, సౌత్ ఆఫ్రికా -100 రండ్ లు, కత్తర్ 55 రియాల్స్ భక్తుల అమ్మవారికి కానుకల రూపంలో హుండీలో వేశారు.

ఆన్లైన్ హుండీ ద్వారా 67,230 రూపాయలు నగదును భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ హుండీ లెక్కింపులో పాలకమండలి సభ్యులు కట్టా సత్తయ్య, సహాయ కార్యనిర్వాహణాధికారులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, ఎస్పీఎఫ్, వన్-టౌన్ పోలీసు సిబ్బంది, భవానీ సేవా దారులు పాల్గొన్నారు.

# ఇంద్రవెల్లి నుంచే సీఎం లోక్ సభ ఎన్నికల శంఖారావం.. శ్రీహరిరావు

ఆదిలాబాద్, జనవరి 30: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో 17లోక్ సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా టీపీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాచరణ ప్రారంభించారు. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం ఇంద్రవెలిలో ఫిబ్రవరి 2న భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేస్తున్నారు.

ఈసందర్భంగా డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు మాట్లాడుతూ? ఇంద్రవెల్లి సభ నుండి పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూరిస్తారని తెలిపారు. సీఎం సభకు భారీగా జన సమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి లక్ష మందికి పైగా ప్రజలు హాజరయ్యేలా కార్యాచరణ సిద్ధం చేస్తునట్లు పేర్కొన్నారు.

# విద్యార్థులు సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలి : ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్, జనవరి 30:విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్ నగర్‌లోని స్పోర్ట్స్ గ్రౌండ్‌లో ఆర్ఎస్ఎంఏ ఆధ్వర్యంలో యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

విద్యార్థులను మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదన్నారు. స్ట్రెస్ నుంచి విద్యార్థులు రిలాక్స్ కావడానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని స్పష్టం చేశారు. విద్యార్థులు సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. తమ సమయాన్ని వృథా చేసుకోకుండా లక్ష్యంపై దృష్టి పెట్టాలన్నారు.

# 'ముందు మీ అయ్యతో కామారెడ్డికి వచ్చి ఎందుకు పోటీ చేశాడో చెప్పించు"

## – కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ షబ్బీర్ అలీ

హైదరాబాద్, జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మాజీ మంత్రి కేటీఆర్ మైనార్టీలపై దొంగ ప్రేమ ఒలకబోస్తున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ దుయ్యబట్టారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. "మీరు అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు ఏం చేశారు? కామారెడ్డికి వచ్చి మీ అయ్య ఎందుకు పోటీ చేసిండు ఒక్క అమాయకుణ్ణి ఓడగొట్టడానికి ఎన్ని ప్రయత్నాలు చేసింర్రు" అంటూ విరుచుకుపడ్డారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు చేసిందేమి లేదన్నారు. తనకు కాంగ్రెస్ సర్కార్ సలహాదారులుగా నియమించిందన్నారు.ఎన్నికల్లో నిలబడ్డ మైనార్టీ నేతలు ఓడిపోయారని.. ఏం చేద్దాం మరి అని ప్రశ్నించారు. మైనార్టీలకు కాంగ్రెస్ అవకాశాలు ఇస్తుందన్నారు. ఇప్పటి వరకు వేసిన టీఎస్పీఎస్సీలో కావచ్చు, సుప్రీం కోర్టులో ఏజీగా మైనార్టీకి అవకాశం ఇచ్చిందన్నారు. రానున్న రోజుల్లో కూడా మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తదని స్పష్టం చేశారు. "ముందు మీ అయ్యతో కామారెడ్డికి వచ్చి ఎందుకు పోటీ చేశాడో చెప్పించు" అంటూ కేటీఆర్‌పై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# భారత్‌లోని ప్రధాన నగరాలలోయూఎస్ ఇమ్మిగ్రేషన్ ఫండ్ ఈబీ 5 రోడ్డు షోలు

U.S. IMMIGRATION FUND

హైదరాబాద్, జనవరి 30: విదేశీ మూలధనాన్ని ఆకర్షించడం, ఉద్యోగాలను సృష్టించడం ద్వారా యూఎస్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా యూఎస్ ఇమ్మిగ్రేషన్ ఫండ్ ఈబీ 5 రోడ్డు షోలు నిర్వహించనున్నామని యూఎస్ఐఎఫ్ ప్రెసిడెంట్ నికోలస్ ఏ మాస్ట్రోయిన్ని 3 తెలిపారు. భారత ఆర్థిక సంవత్సరం ఈ మార్చితో ముగియనుండడంతో భారతీయ పెట్టుబడిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ రోడ్డు షోలు భారత్‌లోని ప్రధాన నగరాల్లో జరగనున్నాయని పేర్కొన్నారు. ఇది వీసా ప్రోగ్రామ్ చుట్టూ కేంద్రీకృతమై ఉంటుందన్నారు. 1990లో స్థాపించిన ఈబీ-5 ప్రోగ్రామ్ విదేశీ పెట్టుబడిదారులకు యూఎస్ లో శాశ్వత నివాసానికి ఒక మార్గం అన్నారు. అర్హత కలిగిన యూఎస్ వ్యాపారంలో కనీసం ఎనిమిది లక్షల (వి 800,000) డాలర్లు పెట్టుబడి పెట్టవచ్చన్నారు. ఈ పెట్టుబడిదారులు తమకు, వారి జీవిత భాగస్వామికి, 21 ఏళ్లలోపు అవివాహిత పిల్లలకు గ్రీన్ కార్డ్‌ను పొందవచ్చని తెలిపారు. ఈ రోడ్డు షో ముందుగా ఢిల్లీలో ఫిబ్రవరి 11, 12 తేదీలలోనూ, అహ్మదాబాద్లో 13 నుంచి 15వ తేదీలలోనూ, ముంబయిలో 16 నుంచి 18వ తేదీలలోనూ, సూరత్లో 20 నుంచి 22వ తేదీలలోనూ, బెంగళూరులో 23, 24 తేదీలలోనూ, హైదరాబాద్లో 25 నుంచి 27వ తేదీలలోనూ చెన్నైలో 28, 29వ తేదీలలోనూ ఉంటుందన్నారు. యూఎస్ గ్రీన్ కార్డ్ కోరుకునే భారతీయ పెట్టుబడిదారులకు సరైన ఎంపిక అవుతుందన్నారు. పెట్టుబడి ద్వారా శాశ్వత నివాసానికి ప్రత్యక్ష మార్గమన్నారు. దీర్ఘకాలిక ప్రణాళిక కోసం సమగ్రమైన, ఆకర్షణీయమైన ఎంపికగా ఉంటుందన్నారు. ఈ రోడ్‌షోలో పెట్టుబడిదారులు, ఆయా కుటుంబాలను యూఎస్ఐఎఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అక్షత్ గుప్తాతో పాటు ఇమ్మిగ్రేషన్ అటార్నీని కలవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈబీ-5 వీసా దరఖాస్తు రుసుం 2024లో గణనీయంగా పెరుగనుందని తెలిపారు. ఈ రోడ్‌షో యునైటెడ్ స్టేట్స్‌లో తమ కుటుంబ భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకోవాలని చూస్తున్న వారికి ఒక పిలుపు అన్నారు. మరింత సమాచారం కోసం.. www.visaeb5.com/indiaroadshow సంప్రదించాలని కోరారు.

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

## -చందుర్తి హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు బొజ్జరపు శంకర్
## -హై స్కూల్ విద్యార్థులకు క్రికెట్ క్రీడా సామాగ్రిని అందజేసిన ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ



రాజన్న సిరిసిల్ల, జనవరి 30:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండల కేంద్రము లోని హై స్కూల్ విద్యార్థులకు ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ క్రికెట్ క్రీడా సామాగ్రిని హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు బొజ్జరాపు శంకర్ చందుర్తి స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ అజ్జు భాయ్ చేతుల మీదుగా విద్యార్థులకు క్రికెట్ క్రీడా సామాగ్రిని మంగళవారం స్కూల్ ఆవరణంలో అందజేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... విద్యార్థులు సెల్ ఫోన్ లకు దూరంగా ఉంటూ చదువుతోపాటు క్రీడలపై దృష్టి పెడితే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు... విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు.... భవిష్యత్తులో విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ మహమ్మద్ అజ్జు భాయ్ తెలిపారు.. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు పులి నారాయణ మేడిశెట్టి మధు నక్క యాకోబు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# బాస్కెట్ బాల్ మ్యాచ్‌లో విషాదం : కోర్టులోనే కుప్పకూలిన 14 ఏండ్ల బాలిక

న్యూఢిల్లీ, జనవరి 30: స్కూల్ మైదానంలో బాస్కెట్ బాల్ గేమ్ ఆడుతూ కుప్పకూలి ప్రాణాలు విడిచిన 14 ఏండ్ల బాలిక ఉదంతం కలకలం రేపింది. అమెరికాలోని ఇల్లినాయిస్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మొమెన్స్ హైస్కూల్‌కు చెందిన అమరి క్రైట్ ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయింది.

ఆటలో భాగంగా బాస్కెట్ బాల్ కోర్టు చివరికి వెళ్లిన బాలిక ఆపై కుప్పకూలింది. క్రైట్ మరణంపై దర్యాప్తునకు అధికారులు ఆదేశించారు. తొమ్మిదో తరగతి చదివే బాలిక హఠాన్మరణంతో స్కూల్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బాలిక మరణం పట్ల ఆమె కుటుంబసభ్యులు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామని స్కూల్ సూపరింటెండెంట్ షనాన్ అండర్సన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ క్రీడల్లో పాల్గొంటూ పలువురు చిన్నారులు, యువత ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు వరుసగా వెలుగుచూడటం ఆందోళన రేకెత్తిస్తోంది.

# ట్రంప్ అలాంటి ఆఫర్ చేయలేదు.. కెన్నెడీ చెప్పిందంతా అబద్ధం: డొనాల్డ్ ట్రంప్ క్యాంపెయిన్ టీమ్




న్యూఢిల్లీ, జనవరి 30:ఈ ఏడాది నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరుగనున్నాయి. దాంతో డెమోక్రటిక్, రిపబ్లికన్ పార్టీల నుంచి అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్న వారి మధ్య ప్రైమరీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రిపబ్లికన్ ప్రైమరీల్లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూసుకుపోతున్నారు. అయోవా, న్యూ హ్యాంప్‌షైర్ ప్రైమరీల్లో ఘన విజయం సాధించిన ట్రంప్.. రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థి రేసులో ముందున్నారు.

త్వరలో జరగనున్న సౌత్ కరోలినా ప్రైమరీలోనూ ఆయనే హాట్ ఫేవరెట్‌గా ఉన్నారు. ఈ క్రమంలో తనతో పాటు ఈ ఎన్నికల్లో రన్నింగ్ మేట్‌గా ఉండాల్సిందిగా రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్‌ను ట్రంప్ కోరినట్లు ప్రచారం జరుగుతున్నది. ఉపాధ్యక్ష పదవికి పోటీ చేయాల్సిందిగా ట్రంప్ తనను అడినట్లు కెన్నెడీ కూడా ధృవీకరించారు. ఆ ఆఫర్‌తో తాను పొంగిపోయానని, అయితే ట్రంప్‌కు రన్నింగ్‌మేట్‌గా ఉండటంపై తనకు ఆసక్తి లేదని స్పష్టం చేశారు.

కాగా, కెన్నెడీ జూనియర్ వ్యాఖ్యలపై ట్రంప్ సీనియర్ అడ్వైజర్ క్రిస్ లాసివిటా స్పందించారు. ట్రంప్ క్యాంపు నుంచి ఎవరూ రాబర్ట్ ఎఫ్ కెన్నెడీని సంప్రదించలేదన్నారు. ఆయనను ఉపాధ్యక్ష పదవికి పోటీ చేయాల్సిందిగా ట్రంప్ అడిగినట్లు కెన్నెడీ చెప్పడం వంద శాతం ఫేక్ అని కొట్టిపారేశారు. కాగా, ఈ రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్.. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ సోదరుడు, అమెరికా మాజీ అటార్నీ జనరల్ అయిన రాబర్ట్ కెన్నెడీ తనయుడు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.